Licensed to post without Prepayment No. J/Nellore/003/15-17 R.N.I.No.25359/74 - PLG/NL/9-10/03

నెల్లూరు, 21.10.2016, శుక్రవారం సంపుటి : 36 సంచిక : 20 పేజీలు : 12, వెల : ₹ 5

ISO 9001-2008



Dr. A.Swaroop Kumar Reddy, M.D.S.,
Professor - Department of Conservative Dentistry
Specialist - Cosmetic, Lasers & Implant Dentistry

CARE SUPER SPECIALITY DENTAL HOSPITAL
16-1/72, Pogathota, Nellore -524 001, (A.P.)
Ph: 0861-2303300, 6555555


Reimbursement Facility For
State Government, APSPDCL & SHAR Employees

# లాయర్

వ్యవస్థాపకులు : తుంగా రాజగోపాలరెడ్డి సంగ్రాహకులు : తుంగా శివప్రభాత్‌రెడ్డి

www.lawyerteluguweekly.com

- పెరగనున్న నియోజకవర్గాలు?
- ప్రత్యేకహోదాను తాకట్టుపెట్టిందందుకే
- తమకు అనువుగా నియోజకవర్గాల విభజన
- పార్లమెంటు ఆమోదం లేకున్నా ఆర్డినెన్స్‌తో సరి!





## బాబు జిత్తులను...

# జగన్ చిత్తు చేసేనా?

*ఏ ఎన్నికలలోనైనా పార్టీల గెలుపుకు ప్రజాదరణ తప్పనిసరి! అయితే ఇది వంద శాతం ప్రభావం చూపుతుందనుకోలేం! ఈ ప్రజాదరణను ఓట్ల రూపంలో మలచుకుంటేనే గెలుపు సాధ్యమవుతుంది. కేవలం గాలివాటాన్ని నమ్ముకుంటేనే గెలుపు రాదు. ఎలక్షన్‌ను వివిధ కోణాలలో చేయాలి. కాళ్లు పట్టుకోవాల్సిన చోట కాళ్లు, గడ్డం పట్టుకోవాల్సిన చోట గడ్డం పట్టుకోవాలి. కులాలు, మతాల రూపంలో ఓట్లు రాబట్టాలి. సెంటిమెంట్లు రెచ్చ గొట్టాలి. నోటికొచ్చిన అబద్దాలన్నీ చెప్పాలి. ఇవన్నీ చేయబట్టే, ఎలక్షన్‌ను ఎలక్షన్ తీరులో చేయబట్టే 2014 ఎన్నికల్లో తనకు చాలా తక్కువ అవకాశాలు ఉన్నప్పటికీ చంద్రబాబు అధికారంలోకి రాగలిగాడు. ఇవన్నీ చేయలేక పోబట్టే తన సభలకు వచ్చిన జనం ఓట్లేస్తే సరిపోతుందని గుడ్డి నమ్మకంతో అవకాశాలు ఎక్కువుగా వున్నా జగన్ అధికారంలోకి రాలేకపోయాడు.*

జగన్ తనను తాను నమ్ముకున్నాడు. మిగతా వారిని, సీనియర్‌లను, పార్టీలోకి వస్తామన్న వారిని నమ్మలేదు. కాబట్టే ప్రతిపక్షం పాత్ర దక్కింది. చంద్రబాబు తనను తాను కాదు కదా తన నీడను కూడా నమ్మలేదు. ఎవరెవరికి ఓట్లున్నాయో వాళ్లను నమ్మాడు. వారితో పొత్తులు కుదుర్చుకున్నాడు. వాళ్ల ఇళ్ల వద్ద పడిగాపులు కాసాడు. కాబట్టే అధికార పక్షం దక్కింది.

రాష్ట్రంలో ఈరోజు కూడా చంద్రబాబు కంటే జగన్‌కే ప్రజాదరణ ఎక్కువుగా వుంది. ఇప్పటికప్పుడు ఎన్నికలు జరిగితే తెలుగుదేశంపార్టీకి 50సీట్లు కూడా రావని, చంద్రబాబు చెప్పి చేయించుకున్న సర్వేలే చెబుతున్నాయి. అయితే దీనిని నమ్మి చంకలు గుద్దుకుంటే జగన్ పప్పులో కాలేసినట్లే! 2014 ఎన్నికలకు ముందు కూడా రాష్ట్రంలో తెలుగుదేశం పార్టీ పరిస్థితి ఇంతకంటే దారుణంగానే ఉండింది. సర్వేలు కూడా ఇదే విధంగా చెప్పాయి. కాని, అంతటి ప్రతికూల పరిస్థితుల్లో కూడా చంద్రబాబు తన అనుభవంతో ఎదురీది నెగ్గుకొచ్చాడు. రాజకీయాల్లో అనుభవానికి, అనుభవ రాహిత్యానికీ మధ్య ఎంత తేడా వుందన్నది 2014 ఎన్నికలు స్పష్టం చేశాయి. ఇంకో 20ఏళ్లు మనమే అధికారంలో

(మిగతా 11వ పేజీలో)

# 'నుడా' ఆవిర్భావం

- తల తడ వైపు... తోక కావలి వైపు
- ఛైర్మెన్ రేస్‌లో దీపా వెంకట్, డా॥ జడ్.యస్





*గత కాంగ్రెస్ ప్రభుత్వ కాలం నుండి కూడా పత్రికలలో, ప్రచారంలో విస్తృతంగా కనిపించి, వినిపించిన నెల్లూరు అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ(నుడా) కల ఎట్టకేలకు నెరవేరింది. నెల్లూరు అర్బన్ డెవలప్‌మెంట్ ఏర్పాటుకు రాష్ట్ర మంత్రివర్గం ఈ నెల 18వ తేదీన ఆమోదముద్ర వేసింది. 'నుడా'కు తుది రూపం కూడా వచ్చేసింది.*

నెల్లూరు నగరపాలక సంస్థతో పాటు కావలి, గూడూరు, సూళ్లూరుపేట, నాయుడుపేట మున్సిపాల్టీలు, కావలి, బోగోలు, అల్లూరు, కొడవలూరు, విడవలూరు, కోవూరు, నెల్లూరు రూరల్, వెంకటాచలం, మనుబోలు, గూడూరు, చిల్లకూరు, వాకాడు, చిట్టమూరు, ఓజిలి, నాయుడుపేట, పెళ్లకూరు, డి.వి.సత్రం, చిత్తూరు జిల్లాలోని సత్యవేడు, వరదయ్యపాలెం మండలాలను కలిపి 'నుడా'కు తుదిరూపం ఇచ్చారు. ఓ మాటలో చెప్పాలంటే

(మిగతా 11వ పేజీలో)

# వలస పక్షుల్లో వేదన

## పదవులు లేవు... పరపతి లేదు!

*ఎరక్కపోయి వచ్చాము ఇరుక్కుపోయాము అన్నట్లుగా వుంది వైయస్సార్‌కాంగ్రెస్ పార్టీ నుండి తెలుగుదేశంలో దూరిన ఎమ్మెల్యేల పరిస్థితి. తెలుగుదేశం ఎమ్మెల్యేలు కోట్లు కోట్లు సంపాదిస్తున్నారని, నియోజకవర్గాలలో వారి హవా నడుస్తుందని, అక్కడకు పోతే మనం కూడా దర్జాగా ఉండొచ్చని భావించి 21మంది దాకా వైసిపి ఎమ్మెల్యేలు తెలుగుదేశంలో చేరారు. వీరిలో కొందరు చంద్రబాబు తాయిలాలకు ఆకర్షితులు కాగా, బలమైన నాయకులకు మాత్రం మంత్రి పదవులను ఎరగా వేశారు. వీళ్లంతా కూడా పార్టీ నుండి వచ్చేటప్పుడు జగన్‌కు మంచి మర్యాద తెలియదని, సీనియర్లంటే గౌరవం లేదని, తెలుగు దేశంలోకి రావడం పుట్టింటికి వచ్చినట్లుగా వుందని రకరకాల ప్రకటనలు చేశారు. తెలుగుదేశంలో చేరాక తామే కింగ్‌లమనుకున్నారు.*

కాని, ఇప్పుడు అక్కడ పరిస్థితి చూసి కొందరు ఎమ్మెల్యేలు మేం పెనం మీద నుండి పొయ్యిలో పడ్డామని బాధపడుతున్నట్లు తెలుస్తోంది. ముఖ్యంగా ఒక సామాజిక వర్గానికి చెందిన ఎమ్మెల్యేలైతే మనసు చంపుకుని తెలుగుదేశంలో చేరారు. కాని ఆ పార్టీలో నెలకొన్న పరిస్థితులు వీరికి ఏ మాత్రం మింగుడు పడడం లేదు. తమ నియోజకవర్గాలలో అంతకుముందే వున్న

(మిగతా 11వ పేజీలో)

## ఉత్తరక్రియలు



మమతానురాగాల అమృతమూర్తి, ప్రేమాభిమానాలకు
ప్రతిరూపంగా నిలిచిన మా మాతృమూర్తి, మా ఇంటి దైవం
**శ్రీమతి మునమాల రామసుబ్బమ్మ గారు**
(W/o. Late మునమాల రామిరెడ్డి)
తేది. 15.10.2016, శనివారం స్వర్గస్తురాలైనారు.
ఆమె ఆత్మకు శాంతిని చేకూర్చమని భగవంతుని ప్రార్థిస్తూ...
అశ్రునయనాలతో...

కుమారులు - కోడళ్ళు
**మునమాల దయాకర్‌రెడ్డి - రమ**
మనుమరాళ్ళు: నివిత, నిషిత
**డా॥ మునమాల మదన్‌మోహన్‌రెడ్డి - డా॥ సమీర**
(చీఫ్ కన్సల్టెంట్, ఆర్థోపెడిక్, అపోలో హాస్పిటల్స్, చెన్నై)
మనుమరాలు, మనుమడు: హర్షిత, హర్షవర్ధన్‌రెడ్డి
కుమార్తె - అల్లుడు
**సబ్బసాని ప్రభావతమ్మ - శ్రీనివాసరెడ్డి**
మనుమరాలు, మనుమడు:
దుర్గా సాహితి, యశ్వంత్‌రెడ్డి

**ఉత్తరక్రియలు :**
తేది. 27.10.2016 గురువారం ఉ॥ 10గంటలకు నెల్లూరుజిల్లా, కలువాయి గ్రామంలోని మా స్వగృహం నందు జరుగును. కావున సమయాభావం వల్ల బంధుమిత్రులకు పత్రికాముఖంగా తెలియజేయడమైనది.

# వాల్మీకి అడుగుజాడల్లో నడవాలి




మహర్షి వాల్మీకి మహాత్ముని అడుగుజాడల్లో నడిచి నేటి సమాజం సుఖసంతోషాలతో ఉండాలని జాయింట్ కలెక్టర్ - 2 ఆర్ఎస్ రాజ్‌కుమార్ అన్నారు. ఆదివారం నెల్లూరులోని అంబేద్కర్ భవన్‌లో వాల్మీకి మహర్షి జయంతి ఉత్సవాలను అధికారికంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మనిషి గతంలో తప్పిదాలు చేస్తే వాటిని విడనాడి సన్మార్గంలో నడవాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం మహర్షి వాల్మీకి జయంతి ఉత్సవాలు అధికార పూర్వకంగా చేయడం దానికనుగుణంగా బలహీనవర్గాల అభివృద్ధికి ప్రభుత్వం అనేక పథకాలు చేపట్టడం జరిగిందన్నారు. ముందుగా వాలల్మీకి చిత్రపటానికి జాయింట్ కలెక్టర్ పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సమావేశంలో జిల్లా బిసి సంక్షేమశాఖాధికారి సంజీవరావు, వాల్మీకి సంఘ గౌరవ అధ్యక్షులు పి.రవీంద్రబాబు, జిల్లా అధ్యక్షులు నల్లబోతుల వెంకటేశ్వర్లు, యూత్ కో-ఆర్డినేటర్ సునీల్‌కుమార్, నగర అధ్యక్షులు వి.మల్లిఖార్జున, బి.సి. నాయకులు దేవరాల సుబ్రహ్మణ్యాయాదవ్, పద్మజా యాదవ్, వింజమూరు మస్తాన్‌రావు, సుబ్బరాయుడు తదితరులు పాల్గొన్నారు.

# 23న సన్ వార్షికోత్సవ వేడుకలు


సన్ యూత్, సాహిత్య, సాంస్కృతిక, సామాజిక, ఆధ్యాత్మిక సంస్థ 9వ వార్షికోత్సవాన్ని ఈనెల 23వతేదీ ఆదివారం ఉదయం 9.30గంటల నుండి రాత్రి 10గంటల వరకు నెల్లూరు టౌన్‌హాల్లో నిర్వహిస్తున్నట్లు సంస్థ అధ్యక్షులు అబోతుల దశయ్య ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా జిల్లా స్థాయి దేశభక్తి గీతాలు, సినీ సంగీత పాటల పోటీలు, నృత్యపోటీలు, చిత్ర లేఖనం, యోగా పోటీలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. సాహిత్య, సాంస్కృతిక, సామాజిక రంగాల్లో ప్రావీణ్యం పొందినవారికి, 10వ తరగతి, ఇంటర్‌లో ఉత్తీర్ణత పొందిన పేద గిరిజన విద్యార్థినివిద్యార్థులకు అంతర్జాతీయ పర్వతారోహకులు మల్లి మస్తాన్‌బాబు స్మారక ప్రతిభా పురస్కారాలు అందిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో నగరంలోని ప్రముఖులు పాల్గొంటున్నట్లు పేర్కొన్నారు.

# చెంగాళమ్మ ఆలయానికి రూ.1.30లక్షల విరాళం

నెల్లూరుజిల్లా సూళ్లూరుపేటలోని శ్రీ చెంగాళమ్మ ఆలయానికి హైదరాబాద్‌కు చెందిన స్వాదిప్ ఈ నెల 14వ తేదీ రూ.1.30 లక్షలు ఆలయ ఛైర్మన్ ముప్పాళ్ళ వెంకటేశ్వరరెడ్డి, ఆలయ కార్యనిర్వాహణాధికారి శ్రీనివాసరెడ్డికి విరాళంగా అందజేశారు. ఇందులో రూ.20వేలు నిత్యాన్నదాన పథకానికి, మిగిలిన రూ.1.10లక్షలు ఆలయంలో రెండు చోట్ల ఎయిర్‌కూలర్లు ఏర్పాటు చేయడానికి ఆయన అందజేశారు. మాజీ మండలాధ్యక్షుడు పిట్ల సుబ్రహ్మణ్యం, పాలకవర్గ సభ్యులు పెరుమాళ్, ఆకుతోట రమేష్, సూరిబాబు, పి.శ్రీనివాసులురెడ్డి పాల్గొన్నారు.

## జిల్లాపై...

# 'డెంగీ దండయాత్ర'



***నెల్లూరుజిల్లాలో డెంగీ పంజా విసిరింది. దీంతో డెంగీ వ్యాధిగ్రస్తులతో ఆసుపత్రులు కిటకిటలాడుతున్నాయి. జిల్లా వ్యాప్తంగా 22మందికి డెంగీ ఉన్నట్లు పరీక్షల ద్వారా తేలింది. అందులో 8కేసులు నెల్లూరు నగర పరిధిలో ఉన్నాయి.***

గత ఏడాది వందల సంఖ్యలో డెంగీ కేసులు నమోదయ్యాయి. ఈ ఏడాది ప్రారంభంలోనే 22 కేసులు నమోదు కావడం అధికారుల్లో ఆందోళన రేకెత్తిస్తోంది. నెల్లూరులోని మన్సూర్ నగర్, వెంగళరావునగర్, వెంకటేశ్వరపురం, భక్తవత్సలనగర్ తదితర ప్రాంతాల్లో డెంగీ కేసులు నమోదయ్యాయి. జిల్లాలోని పలు మండలాల్లో 14కేసులు నమోదయ్యాయి. ముందు జాగ్రత్త చర్యలుగా దోమల లార్వా నిర్మూలన కోసం పారిశుద్ధ్య చర్యలు చేపట్టినట్లు అధికారులు చెబుతున్నారు. నెల్లూరు నగరంలోని ప్రైవేటు ఆసుపత్రుల్లో వందల సంఖ్యలో రోగులు మలేరియా జ్వరాలతో చికిత్స చేయించుకుంటున్నారు.

ప్రభుత్వం దోమలపై దండయాత్ర పేరిట లక్షల రూపాయలు ఖర్చు చేసినా ఫలితం శూన్యంగా మారగా... దోమలు మనపై ప్రతి దాడికి దిగుతూ మలేరియా, డెంగ్యూ, చికున్‌గున్యా తదితర వ్యాధులతో విరుచుకుపడుతున్నాయి.

# విద్యుత్ చోరులపై కేసులు

జిల్లాలో విద్యుత్ అధికారులు తనిఖీలు చేసి అక్రమంగా విద్యుత్‌ను వాడుకుంటున్న 182 మందిపై కేసులు నమోదు చేసి, వారి నుంచి 16 లక్షల రూపాయలను జరిమానాగా వసూలుచేశారు. ట్రాన్స్‌కో విజిలెన్స్, యాంటీపవర్ థెఫ్ట్ స్క్వాడ్ ఆధ్వర్యంలో బుధవారం జిల్లావ్యాప్తంగా తనిఖీలు నిర్వహించి విద్యుత్ చౌర్యం చేస్తున్నవారిపై ఆ మేరకు కేసులు నమోదు చేశారు. విద్యుత్‌భవన్‌లో బుధవారం ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ట్రాన్స్‌కో విజిలెన్స్ ఎస్ఇ రవి, ఏపిటిఎస్ ఎస్పీ మనోహర్‌రావు మాట్లాడుతూ, మీటర్ వుండి కనెక్షన్ బైపాస్ చేసిన 31 మంది, మీటరు లేకుండా నేరుగా తీగలకు తగిలించి విద్యుత్ చౌర్యానికి పాల్పడుతున్న 60 మందిపై కేసులు నమోదు చేశామన్నారు. అదేవిధంగా ఇంటికి కనెక్షన్ తీసుకుని వ్యాపారానికి వినియోగిస్తున్న 19 మంది, బిల్లింగ్‌లో అవకతవకలకు పాల్పడుతున్న ఇద్దరు, అదనపు లోడ్‌ను వినియోగిస్తున్న 67 మందిపై కేసులు నమోదు చేశామన్నారు. వీరి నుంచి 16 లక్షలు జరిమానాగా వసూలు చేశామన్నారు. విద్యుత్ చౌర్యానికి పాల్పడుతున్నవారిలో ఆక్వాకు సంబంధించి 7 లక్షలు, కనెక్షన్ లేకుండా ఏసిని వినియోగిస్తున్న వినియోగదారుడి నుంచి లక్షరూపాయలు అపరాధ రుసుంగా వసూలు చేశామన్నారు. విద్యుత్ కనెక్షన్ లేనివారు దీనదయాళ్ యోజన పథకం కింద 125 రూపాయలకే సర్వీసును పొందవచ్చని వారు ఈ సందర్భంగా తెలిపారు. ఈ సమావేశంలో ఏపిటిఎస్ సిఐ నాగేశ్వరమ్మ తదితరులు పాల్గొన్నారు.

సింహపురి సమాచారం

## గ్రామాల్లో ఉచిత యోగ

# శిక్షణ కేంద్రాలు

సంపూర్ణ ఆరోగ్యానికి ఎంతగానో దోహదం చేసే యోగ విద్యను గ్రామీణులకు చేరువ చేసేందుకు గ్రామాల్లో ఉచిత యోగ శిక్షణ కేంద్రాలను ఏర్పాటు చేయనున్నట్లు గణపతి సచ్చిదానంద స్వామి ట్రస్ట్ అంతర్జాతీయ యోగ శిక్షకుడు రాజారావు తెలిపారు. నెల్లూరు సుజాతమ్మ కాలనీలోని శ్రీకృష్ణ యోగ మందిరంలో బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ, యోగ విద్యను గ్రామీణులకు అందించేందుకు ట్రస్ట్ ప్రత్యేక ప్రణాళికను రూపొందించిందన్నారు. ఇందులో భాగంగా ఇటీవల కావలిలో యోగ శిక్షణ కేంద్రాన్ని ప్రారంభించామని, దీపావళి అనంతరం జిల్లావ్యాప్తంగా యోగ శిక్షణ కేంద్రాలను ప్రారంభించేందుకు కృషి జరుగుతుందని తెలిపారు. మందిరం మేనేజింగ్ ట్రస్టీ పచ్చిపాల ప్రమీలమ్మ, యోగ శిక్షణ కో-ఆర్డినేటర్ రుష్యేంద్ర బాబు, మందిర సభ్యులు సుబ్రహ్మణ్యారెడ్డి, శ్రీనివాసులురెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పుస్తక సమీక్ష

# విద్యార్థులకు పాఠ్యాంశం కాదగిన బొగ్గరపు 'వ్యాసమంజరి'


ఓ పదిహేను వివిధ అంశాలపై రాసిన వ్యాసాలు ధ్యానమాలిక, సరస్వతీ విద్యాపీఠం, లీడ్ ఇండియా, న్యూస్‌కమాండో కామ్‌ల పోటీల్లో కొన్ని బహుమతి పొందినవైతే, మరికొన్ని ప్రచురించబడినవి అన్నీ కలిపి 'వ్యాసమంజరి' పేరుతో 72 పేజీల పుస్తకాన్ని ప్రచురించారు ప్రముఖ కవి బొగ్గరపు రాధాకృష్ణమూర్తి.

విచక్షణ, వివేచనల మేలికలయిక బొగ్గరపు రాధాకృష్ణమూర్తి. అందుకే కవిత్వంతోబాటు వ్యాసాలనూ ప్రచురింపజేయగల్గాడు. వ్యాసం రాయాలంటే విషయపరిజ్ఞానం మెండుగా వుండాలి. కవిత రాసినంత సులభం కాదు వ్యాసం రాయడానికి. అందుకేనేమో విషయపరిజ్ఞానంలోనూ తనకు తానే సాటి అనిపించుకున్న బొగ్గరపు ఆ దిశలో 'వ్యాసమంజరి'ని మన ముందుంచాడు.

మానవతావాదంపై రెండు వ్యాసాలు వ్రాసి ప్రతిమనిషి మానవతావాది కావాలని ఆకాంక్షించాడు. దైవత్వం తర్వాత మానవత్వమే సృష్టిలో విశిష్టమైనదిగా కవి పేర్కొంటాడు. మానవత్వం లేని మనిషి దానవుడితో సమానమేనంటాడు. మానవత్వమే మనిషిని మనీషిగా, మహర్షిగా మహిలో నిలుపుతుందంటాడు.

వర్తమాన కాలంలో ఉగ్రవాదం, నేరాలు-ఘోరాలు పెరుగుతున్న నేటి సమాజానికి కావలసింది మానవతావాదమేనన్న కవి ఆకాంక్ష ఎంతో ఉన్నతమైనది. లోకకళ్యాణం కోసం ఆయన రాసిన






**వ్యాస మంజరి**
పేజీలు : 72 వెల : రూ.100/-
ప్రతులకు: శ్రీమతి బొగ్గరపు ఇందిరా కృష్ణ
ఇంటి నెం. 16-8-364,
శ్రీ చైతన్య కాలేజ్ ఎదురుగా, రామలింగాపురం,
నెల్లూరు. సెల్. 9885481939

మానవతావాదం అత్యంత గొప్పది. ప్రతిఒక్కరూ అభినందించదగ్గది. కమ్యూనిజంలో నిజం లేదు. అందులో లేని నిష్కల్మషత్వం, క్యాపిటలిజంలో లేని నిష్పక్షపాతత్వం మానవతావాదంలో వున్నాయి. సర్వేజనా సుఖినోభవంతు అనే మహత్తరమైన భావం దానిలో ఇమిడివుంది. మానవతావాదమే గౌతమ బుద్ధుని భగవంతునిగా మలచింది. మానవతావాదమే శిబి చక్రవర్తిని కరుణామూర్తిగా నిలిపింది. మానవతా వాదమే అశోకుని కీర్తిని దశదిశలా వ్యాపింపజేసింది. విశ్వజనీనమైన మానవతావాదం ప్రపంచం వెలుగుబాటపై పయనించాలని కవి కోరుకున్నాడు. అసలు మానవధర్మానికి పర్యాయపదమే మానవతావాదం.. అంటారు బొగ్గరపు రాధాకృష్ణమూర్తి.

ఒక వ్యక్తిని మరో వ్యక్తి, ఒక జాతిని మరో జాతి పీడించే సాంఘిక ధర్మం ఇంకానా ఇకపై సాగదు.. అంటూ బానిసత్వాన్ని నిరసించి మానవతే దయం కోసం పరితపించిన మహాకవి శ్రీశ్రీ మహాప్రస్థానంలోని చరణాలు ప్రస్తావించాడు బొగ్గరపు. దాశరథి 'తిమిరంలో సమరం'లో మానవత్వం గెలుస్తుంది. 'దానవత్వం ఓడుతున్నది. అవనిలో హృదయాలలో గల అంధకారం వీడుతున్నది'..అని పేర్కొన్న దాశరథి కవితాసూక్తుల్ని ఉటంకించాడు. గొప్ప మానవతావాద కవి బొగ్గరపు ఆశ నెరవేరాలని, లోక కళ్యాణం జరగాలని ఆశిద్దాం. ఉగ్రవాదంపై ఉగ్రనేత్రం తెరుద్దాం.

సనాతన ధర్మంపై కవి మక్కువ ప్రదర్శించాడు ఒక వ్యాసంలో. సర్వకాల వ్యవస్థలలోనూ శాశ్వత విలువలతో విరాజిల్లేదే సనాతన ధర్మమంటాడు కవి. సనాతన ధర్మం అంటే పురాతన ధర్మం కాదంటాడు. అందువల్లే యుగయుగాలుగా సనాతన ధర్మం అఖండ జ్యోతిలా వెలిగిపోతుందంటాడు.

తెలుగుపాటకు ఘంటసాల స్వరంపై ఒకచోట రాస్తూ, తెలుగు పాటకు జవసత్వాలను చేకూర్చిన ఘంటసాలగారిని శ్లాఘించాడు బొగ్గరపు కవి.

భారతదేశాన్ని భరతమాతగా పిలుచుకుంటూ, దేవతగా కొలుచుకుంటూ పవిత్రస్థానాన్ని, పూజనీయ భావాన్ని ప్రకటించుకుంటున్నాం. సృష్టిలో జన్మనిచ్చే స్త్రీమూర్తిది అత్యంత గౌరవస్థానం. అంతటి మాతృమూర్తిపై దాడులు జరగడంపై కవి కన్నెర్రజేసాడో వ్యాసంలో.! మహిళలపై దాడులను నిరసించాడు.

మంచిగా జీవించడంలో వుండే ఆనందం, మనిషిగా జీవించడంలో వున్న అనుభూతి ఇక దేనిలోనూ వుండదని కవి, రచయిత బొగ్గరపు చెప్పాడు. మొత్తానికి 'వ్యాసమంజరి' విద్యార్థులకు గొప్ప వరంగా వ్యాసాలను రచించిన బొగ్గరపు కవీంద్రులు అభినందనీయులు.

ఇది విద్యార్థులకు తమ పాఠ్యాంశాలలో భాగం కాగలిగిన పుస్తకం. తెలుగువారికి మంచి ఉపదేశాన్ని, సందేశాన్ని అందించగల్గిన వ్యాస సంపుటం. కవి భావావేశానికి అద్దం పట్టిన అద్భుతంగా పేర్కొనవచ్చు. కవికి నా అభినందనలు.



- చిన్ని నారాయణరావు
94402 02942

# నత్తతో పోటీ పడుతున్నారు



నెల్లూరు రూరల్ నియోజకవర్గంలో అనేక ప్రాంతాల్లో అభివృద్ధి పనులు నత్త నడకను తలపిస్తున్నాయని ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి ఆరోపించారు. ఈ నెల 20వ తేదీన బి.వి.నగర్‌లోని బ్యాంక్ కాలనీలో ప్రజాబాట నిర్వహించిన ఆయన స్థానిక సమస్యలపై ప్రజలతో చర్చించారు. చాలా ప్రాంతాల్లో అభివృద్ధి పనుల టెండర్లు పూర్తయినా, ఇంకా పనులు ప్రారంభించలేదని, పనులు చేయడంలో ఎందుకింత నిర్లక్ష్యం అని కార్పొరేషన్ అధికారులను ప్రశ్నించారు. రూరల్ నియోజకవర్గంలోని కాలనీలు వేగవంతంగా జనావాసాలతో విస్తరిస్తున్నాయని, ఆ ప్రాంతాల్లో రోడ్లు, డ్రైన్లు, మంచినీళ్లు, కరెంటు వంటి సౌకర్యాలను యుద్ధప్రాతిపదికన చేపట్టాల్సి వుండగా, అధికారులు ఆ వైపు దృష్టి సారించడం లేదన్నారు. చిన్న చిన్న పనులకు కూడా అధికారుల చుట్టూ ఆరేడుసార్లు తిరగాల్సి వస్తోందని, 50సార్లకు పైగా ఫోన్లు చేయాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. టెండర్ల ప్రక్రియ పూర్తయిన పనులను వెంటనే ప్రారంభించాలని, లేకుంటే కార్పొరేషన్ కార్యాలయం ముందు నిరవధిక ధర్నా చేస్తానని కోటంరెడ్డి హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో వైసీపీ నాయకులు ఎం.సురేష్‌రెడ్డి, రాజారెడ్డి, గోపిరెడ్డి, వెంగళ్‌రెడ్డి, చేజర్ల మహేష్, కొండారెడ్డి, భాస్కర్‌రెడ్డి, వెంకటరామయ్య, మునిస్వామి, దైవాదీనం, సప్తగిరి శ్రీనివాసులురెడ్డి, డిఎంకె వెంకటేశ్వర్లు, ఆదిశేషయ్య, రాజగోపాల్ తదితరులు పాల్గొన్నారు.

## వీపిఆర్ ఫౌండేషన్లో...

# వృత్తివిద్యా కోర్సులకు శ్రీకారం

## ప్రారంభించిన వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి



ప్రముఖ పారిశ్రామికవేత్త, వదాన్యుడు వేమిరెడ్డి ప్రభాకరరెడ్డి బుధవారం కనుపర్తిపాడులో విద్యార్థులకు ఎంతో ఉపయోగకరమైన వృత్తివిద్యా కోర్సులకు ప్రారంభోత్సవం చేశారు. విపిఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలోని విపిఆర్ సెంటర్ ఫర్ ఒకేషనల్ స్టడీస్‌లో కోర్సులు ప్రారంభమయ్యాయి. ఫ్యాషన్ డిజైన్ అండ్ గార్మెంట్ మేకింగ్, ఫుడ్ అండ్ బెవరేజెస్, కంప్యూటర్ నిర్వహణ మరియు ట్రబుల్‌షూటింగ్ ఎంఎస్ ఆఫీస్, ఫ్రంట్ ఆఫీస్ మేనేజ్‌మెంట్ అనే అయిదు రకాల కోర్సులు ప్రారంభిస్తున్నట్లు ఈ సందర్భంగా వేమిరెడ్డి తెలిపారు. జిల్లాలో తొలిసారిగా ఈ వృత్తివిద్యా కోర్సులకు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం గుర్తింపు లభించిందని, ఈ కోర్సులు ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాలు, నగర ప్రాంతాల్లోని విద్యార్థులకు ఉద్యోగ కల్పనకై ఉద్దేశించినవని ఆయన అన్నారు. త్వరలోనే విపిఆర్ ఫౌండేషన్ అటు కృష్ణపట్నం పోర్టుతోను, శ్రీసిటితోనూ అవగాహన ఒప్పందం కుదుర్చుకునే దిశగా ప్రయత్నాలు చేస్తోందని ఆయన తెలిపారు. విద్యార్థులు తమ కోర్సులను పూర్తిచేసుకున్న వెంటనే ఈ అతిపెద్ద పారిశ్రామికవాడల్లో తగు ఉద్యోగావకాశాలు లభించేందుకు అవకాశాలు మెండుగా వుంటాయని ఆయన తెలిపారు. ఈ అవకాశాన్ని జిల్లాలోని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో విపిఆర్ ఫౌండేషన్ మేనేజింగ్ ట్రస్టీ శ్రీమతి ప్రశాంతిరెడ్డి, ఫౌండేషన్ ప్రధాన కార్యనిర్వహణాధికారి ఆచార్య వి.నారాయణరెడ్డి, వృత్తి విద్యా కోర్సుల ప్రిన్సిపాల్ శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

## 3 వసంతాల విపిఆర్ కన్వెన్షన్ సెంటర్



ఈ నెల 19వ తేదితో కనుపర్తిపాడులోని విపిఆర్ కన్వెన్షన్ సెంటర్ మూడు వసంతాలు పూర్తి చేసుకుని నాల్గవ వసంతంలోకి అడుగుపెడుతుండడం తనకెంతో సంతోషంగా వుందని వేమిరెడ్డి ప్రభాకరరెడ్డి అన్నారు. కనుపర్తిపాడులోని విపిఆర్ కన్వెన్షన్ సెంటర్‌లో బుధవారం జరిగిన కార్యక్రమంలో ఆయన పాల్గొని కేక్ కట్‌చేసి కన్వెన్షన్ సెంటర్ ఉద్యోగులతో ఆనందాన్ని పంచుకున్నారు. విపిఆర్ కన్వెన్షన్ సెంటర్ ఎన్నో సంప్రదాయ, ఆధ్యాత్మిక కార్యక్రమాలకు వేదికగా నిలిచిందని ఆయన సంతోషాన్ని వ్యక్తం చేశారు. ఆగస్టులో చిన్నజీయర్‌స్వామీజీ వచ్చిన సందర్భంగా ఇక్కడ అతిపెద్ద ఆధ్యాత్మిక కార్యక్రమానికి విపిఆర్ కన్వెన్షన్ సెంటర్ వేదిక కావడం శుభపరిణామమన్నారు.

# పోలీసు అమరవీరుల త్యాగాలు చిరస్మరణీయం



విధినిర్వహణలో అసువులు బాసిన అమర పోలీసు సిబ్బంది త్యాగాలు చిరస్మరణీయమని జిల్లా అదనపు ఎస్పీ శరత్‌బాబు అన్నారు. పోలీసు అమరవీరుల సంస్మరణ వారోత్సవాల్లో భాగంగా నెల్లూరులోని ఉమేష్‌చంద్ర సమావేశమందిరంలో బుధవారం నిర్వహించిన మెగా రక్తదాన శిబిరాన్ని ఆయన ప్రారంభించిన అనంతరం మాట్లాడారు. అమరుల త్యాగాలను పోలీసు సిబ్బంది స్మరించుకుంటూ వారి ఆశయసాధనకు పునరంకితం కావాలన్నారు. అనంతరం, 200 మంది పోలీసు అధికారులు, సిబ్బంది, నగరప్రజలు రక్తదానం చేశారు. వారికి పోలీస్ అధికారుల సంఘం జిల్లా అధ్యక్షుడు మద్దిపాటి ప్రసాదరావు కృతజ్ఞతలు తెలిపారు. రక్తదాన మోటివేటర్ భాస్కరనాయుడు, పోలీసు అధికారులు నిమ్మగడ్డ రామారావు, శ్రీనివాసాచారి, చెంచురెడ్డి, ఎస్‌బి నగర ఇన్‌స్పెక్టర్లు మాణిక్యరావు, రామకృష్ణారెడ్డి, రామారావు, ఎస్‌బి ఎస్‌ఐ శ్రీనివాసరెడ్డి, ఆర్‌ఐ శ్రీనివాసరావు, ఆర్‌ఎస్‌ఐలు అంకమరావు, రమేష్‌కృష్ణన్, రమణ, రాఘవ, ఇన్స్‌పెక్టర్లు సీతారామయ్య, రామారావు, ఒన్‌టౌన్ ఎస్‌ఐ గిరిబాబు తదితరులు పాల్గొన్నారు.


# పోలీసు అమరవీరుల సంస్మరణ దినోత్సవము

2016 అక్టోబర్ - 21



విశాల్ గున్నీ, ఐపిఎస్
సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్
ఎస్‌పిఎస్‌ఆర్ నెల్లూరుజిల్లా.



యస్.రాఘువరావు
డిప్యూటీ సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్
కావలి.

మీరంతా నిద్రలోకి జారుకొన్నప్పుడు --
మేము మేల్కొని ఉంటాం మీ ధన, మాన, ప్రాణాల కోసం
మీరంతా పండుగలు / సంబరాలు చేసుకొంటున్నప్పుడు --
మేము గస్తీ తిరుగుతూ ఉంటాం మీ సుఖ జీవనం కోసం
మీరు మంచి దుస్తులతో ఉదయాన్నే
ఉద్యోగానికి బయలుదేరినప్పుడు --
వేళాపాళా లేని విధుల్లో మాసిన దుస్తులతో
ఇంటికి చేరి, వెంటనే విధుల్లో చేరుతాం మీ సౌలభ్యం కోసం
మీరు అందమైన సూర్యోదయాలు / హాయిగా నిద్రించే రాత్రులు చూస్తున్నప్పుడు --
పగలనకా, రేయనకా - ఎండనకా, వాననకా తిరుగుతూ వుంటాం నేర శక్తుల కోసం
మీరు ఇంట్లో కుటుంబసభ్యులతో అందరూ కలసి ఇంటిలో ఆనందంగా గడుపుతున్నప్పుడు --
ఒంటరిగా ఆరు బయట / అడవుల్లో మా ప్రాణాలు సైతం ధారపోస్తాం సమాజ శాంతి కోసం
మీరు ఇంటి నుండి "ఈ రాత్రికి తిరిగి కలుద్దాం" అని మీ కుటుంబసభ్యులకు ఆనందంగా చెప్పి బయలుదేరుతున్నప్పుడు --
"దేవుడా, మా వారిని క్షేమంగా ఇంటికి చేర్చవా".... అని మా కుటుంబాలు ప్రార్థిస్తుంటాయి మా కోసం

నేస్తమా...
మీరెప్పుడైనా... మీ బంధువులతో బయటకు వెళ్లినప్పుడు... గస్తీ తిరిగే పోలీసు / పోలీసు వాహనాన్ని చూసినప్పుడు... ఒక్క విషయం గుర్తుంచుకోండి...

"రోజులో 24 గంటలూ ప్రజల స్వేచ్ఛా స్వాతంత్ర్యం / ప్రజాస్వామ్య పరిరక్షణ / రాజ్యాంగ రక్షణ కోసం...
తమ ప్రాణాలు సైతం కోల్పోతూ... వ్యక్తిగతంగా, వృత్తిపరంగా...
ప్రతిరోజూ... తమ జీవితాన్ని త్యాగం చేస్తున్న వారే... ఈ పోలీసు" అని.

పోలీసు జీవితాన్ని ప్రారంభించి... అత్యున్నతంగా ముగించి...
వీర మరణం పొందిన మా పోలీసు సోదరులందరికీ
పేరు పేరున హృదయపూర్వక శ్రద్ధాంజలి ఘటిస్తున్నాం

కావలి 1వ పట్టణ పోలీస్
కావలి పోలీస్ సబ్ డివిజన్ - నెల్లూరు జిల్లా.

జె.ఎం. కన్‌స్ట్రక్షన్స్ & డెవలపర్స్ - కావలి



3rd anniversary celebrations
శుభమస్తు™
షాపింగ్‌మాల్
వి.ఆర్.సి.సెంటర్, నెల్లూరు. ఫోన్: 2359597, 98.

100%
షాపింగ్ ఫ్రీ
రూ. 1000 కొనుగోలుపై
రూ. 100 విలువగల 10 కూపన్లు పొందండి..
T&C APPLY

# 'ప్రభా'తం

ప్రపంచ మానవాళిని భయోత్పాతానికి గురిచేస్తున్న ఉగ్రవాద పెనురక్కసిపై భారత్ సింహనాదం చేసింది. ఇక ఉగ్రవాదుల ఆటలు సాగనివ్వరాదంటూ ఈ సారి మరింతగా ప్రపంచానికి స్పష్టం చేసింది. ఉగ్రవాదంపై సమరనాదం మోగిస్తూ ఇటీవల గోవాలో జరిగిన బ్రిక్స్ దేశాల శిఖరాగ్రసదస్సులో భారత ప్రధాని నరేంద్రమోడీ చేసిన ప్రసంగం యావత్ ప్రపంచాన్నీ కదిలిస్తోంది. ఉగ్రవాదంపై సమిష్టి పోరుకు ప్రధాని మోడీ ఇచ్చిన పిలుపుకు ప్రత్యేకించి బ్రిక్స్ దేశాలు బాగా స్పందించాయి. ఆ పిలుపే ఇప్పుడు అనేక దేశాలను మలుపు తిప్పుతోంది. ఉగ్రవాదంపై యుద్ధానికి ఆయా దేశాలు పిడికిళ్ళు బిగిస్తున్నాయి.

శాంతికి, భద్రతకు..అన్ని దేశాల్లోనూ ప్రజల సహజీవనానికి.. మొత్తంగా మానవాళికే శత్రువైన ఉగ్రవాద విషవృక్షాన్ని కూకటి వేళ్ళతో సహా పెకలించకుంటే జరిగే నష్టమేమిటో ప్రధాని ఈ సదస్సులో ఎంతో స్పష్టంగా అర్ధమయ్యేట్లుగా వివరించారు. దీంతో అన్ని దేశాలవారు ఎవరికివారు మోదీ మాటలకు బాగా స్పందించారు. బ్రిక్స్ దేశాధీశులైతే ఇక ఏమాత్రం ఉగ్రవాదాన్ని సహించే ప్రసక్తే లేదని స్పష్టం చేశారు. ఈ నేపథ్యంలో రష్యా భారత్‌తో మైత్రిని కొనసాగిస్తూ భారత్‌కు రక్షణ, ఆర్థిక బాంధవ్య పటిష్టతకు స్నేహహస్తం అందించడం ద్వారా ఇరు దేశాల స్నేహానికి మరింత గట్టి పునాదులు పడడం, ఆ మేరకు 43వేల కోట్ల రక్షణ ఒప్పందాలపై సంతకాలు చేసుకోవడం హర్షదాయకం.

ఇదే సందర్భంలో ఉగ్రవాదంపై సమిష్టి పోరుకు సమాయత్తమయ్యేందుకు బ్రిక్స్ సంకల్పించడం ఒక శుభపరిణామం. సీమాంతర ఉగ్రవాదానికి పాకిస్థాన్ అండదండలను వ్యతిరేకిస్తూ ఇటీవల సార్క్ సమావేశాన్ని భారత్‌తో పాటు మరో నాలుగు దేశాలు బహిష్కరించిన నేపథ్యంలో, బిమ్‌స్టెక్‌ను బలోపేతం చేసే ఈ సరికొత్త ప్రయత్నం అంతర్జాతీయస్థాయిలో ప్రాధాన్యతను సంతరించుకోవడం విశేషం. గోవాలో జరిగిన బ్రిక్స్..(బ్రెజిల్, రష్యా, భారత్, చైనా, దక్షిణ ఆఫ్రికా) దేశాల 8వ శిఖరాగ్ర సదస్సు ఒకరకంగా కొత్తదారులు తొక్కినట్లే. ఈ అయిదు దేశాలు ఉగ్రవాదంపై ఉమ్మడి పోరుకు సమాయత్తమవుతూ పలు నిర్ణయాలు తీసుకోవడం ఒక ముందడుగే. బ్రెజిల్ అధ్యక్షుడు మైఖెల్ టెమర్, రష్యా అధ్యక్షుడు వ్లాదిమర్ పుతిన్, భారత ప్రధాని నరేంద్రమోడీ, చైనా అధ్యక్షుడు జీ జిన్‌పింగ్, దక్షిణాఫ్రికా అధ్యక్షుడు జాకబ్ జుమా ఈ బ్రిక్స్ సదస్సులో పాల్గొన్నారు. ఈ అయిదు దేశాలు ఒక నూతన శక్తిగా ఆవిర్భవించడం శుభపరిణామం. పాశ్చాత్య ఆధి పత్యం సాగుతున్న అంతర్జాతీయ వేదికలపై వ్యూహాత్మక సమన్వయాన్ని అనుసరించడమే కాక, ఆర్థిక వ్యవస్థల్ని పరస్పర ఆధారితాలుగా మార్చాలని భావిస్తూ ఆ మేరకు తగు సమాలోచనలు చేయడం, పాశ్చాత్య దేశాల నుంచి తమ ప్రయోజనాలను రక్షించుకునేందుకు ఒక ఉమ్మడి కార్యాచరణ ప్రణాళికకు బాటలు వేసుకోవడం ద్వారా బ్రిక్స్ సదస్సు ఆశించిన లక్ష్యాలను సాధించేందుకు ముందడుగు వేస్తోండడం శుభపరిణామం. బ్రిక్స్ దేశాల ప్రజలకు నేరుగా ఉపయోగపడేలా ఒక కొత్త అభివృద్ధి బ్యాంక్‌ను ఏర్పాటుచేసుకోవడం కూడా మంచిదే. ఉగ్రవాదుల దాష్టీకాలపై కదనకాహళి మోగించడం తథ్యమని, తద్వారా ప్రపంచానికి శాంతి కాంతులను ప్రసరింపజేసేందుకు రాజీలేని పోరాటం చేస్తామని బ్రిక్స్ దేశాలు ప్రతినబూనడం అన్నిటికన్నా ఆనందం కలిగించే విషయం.

ముఖ్యంగా, ఉగ్రవాదులకు అండగా నిలుస్తున్న పాకిస్థాన్ నైజాన్ని ఈ అంతర్జాతీయ వేదికపై ప్రధాని మోడీ నిలువునా ఎండగట్టారు. ప్రపంచవ్యాప్తంగా ఉగ్రవాదానికి ఆ దేశం ప్రధాన స్థావరంగా వుందని, ఉగ్రవాదం ఆ దేశానికి ముద్దుబిడ్డగా మారిందని, ఉగ్రరక్కసిని నిర్మూలించడానికి అంతర్జాతీయ స్థాయిలో గట్టి చర్యలు అవసరమని ప్రధాని మోదీ నొక్కిచెప్పారు. శాంతికి, భద్రతకి, అభివృద్ధికి ఉగ్రవాదం పెనుముప్పుగా మారిందని, ఉగ్రవాద ముప్పుకు వ్యతిరేకంగా బ్రిక్స్ కూటమి ఒకే గొంతుక వినిపించాలన్నారు. ఉగ్రవాదానికి మన సమాధానం సమగ్రంగా వుండాల్సిందేనని స్పష్టం చేశారు. ఉగ్రవాదులను తయారుచేసేవారికి వ్యతిరేకంగా మన సమాజాలకు భద్రత కల్పించేందుకు బ్రిక్స్, బిమ్‌స్టెక్ దేశాలు సమగ్రంగా స్పందించడం తప్పనిసరి అని ప్రధాని మోడీ కర్తవ్యబోధ చేశారు. దీంతో ఒక్కసారిగా బ్రిక్స్ దేశాల నేతలు హర్షాతిరేకాలు ప్రకటించారు. ఉగ్రవాదం మన సమాజానికి, మన జీవన విధానానికి, మొత్తంగా మానవాళికి ముప్పేనని బ్రిక్స్ నేతలు ఏకగ్రీవంగా అంగీకరించారు. ఉగ్రవాదంపై ఉక్కుపాదం మోపేందుకు బ్రిక్స్ కూటమి నిర్ణయించి అందరి ప్రశంసలందుకుంది. ఉగ్రవాదులు ఎంత ప్రమాదకరమో.. వారిని పెంచి పోషించేవారు, వారికి మద్దతు ఇచ్చేవారు, ఆవాసం కల్పించేవారు, ఆర్థిక సాయం చేసేవారు, ఉగ్రవాదుల కొమ్ము కాసేవారు కూడా అంతే ప్రమాదకరమని ఈ సదస్సు గుర్తించింది. బిమ్‌స్టేక్ దేశాల సమావేశంలో బ్రిక్స్ దేశాధినేతలు, భారత ప్రధాని మోడీతో పాటు, శ్రీలంక అధ్యక్షుడు మైత్రీపాల సిరిసేన, నేపాల్ ప్రధాని ప్రచండ, భూటాన్ ప్రధాని టోబ్గో, బంగ్లాదేశ్ ప్రధాని షేక్ హసీనా, మయన్మార్ విదేశాంగ మంత్రి ఆంగ్‌శాన్ సూచీ పాల్గొన్నారు. బ్రిక్స్ దేశాలతో పాటు, బంగ్లాదేశ్, మయన్మార్, శ్రీలంక, థాయ్‌ల్యాండ్, భూటాన్, నేపాల్‌లతో కూడిన బిమ్స్‌టెక్ కూటమితో భారత్ సన్నిహితంగా వుండడం ఎంతైనా ముదావహం.

ఏదేమైనా, ప్రాంతీయ, అంతర్జాతీయ సవాళ్ళను ఎదుర్కొనేలా బ్రిక్స్ దేశాల నాయకులతో ప్రధాని చేసిన చర్చలు ఫలప్రదం కావడం ఎంతో సంతోషకరం. బ్రిక్స్, బిమ్‌స్టెక్ దేశాల నాయకులను ఒకే వేదిక మీదకి తెచ్చినందుకు ప్రధాని మోడీకి బంగ్లాదేశ్ ప్రధాని షేక్ హసీనా కృతజ్ఞతలు తెలిపారు కూడా.

ఒక్క హసీనాయే కాదు, ఉగ్రవాదానికి వ్యతిరేకంగా ప్రధాని మోడీ తీసుకుంటున్న చొరవకు అన్ని దేశాల నుంచి, యావ త్ ప్రపంచ ప్రజల నుంచీ అలాంటి అభినందనలే లభిస్తున్నాయి. ఇది ప్రధాని మోడీకే కాదు..ప్రత్యేకించి భారత్‌కు ఎంతైనా గర్వకారణం.



## 'బ్రిక్స్'దీ అదే మాట!

**ప్రపంచ మానవాళికే వినాశంగా మారిన ఉగ్రవాదుల దాష్టీకాలపై సమరభేరీ మోగించడం తథ్యమని, తద్వారా ప్రపంచానికి శాంతి కాంతులను ప్రసరింపజేసేందుకు గట్టి పోరాటం చేస్తామని గోవాలో జరిగిన బ్రిక్స్ దేశాల సదస్సు ప్రతినబూనడం చారిత్రాత్మకం. ఉగ్రవాదులకు అండగా నిలుస్తున్న పాకిస్థాన్ నైజాన్ని ఈ సదస్సులో నిలువునా ఎండగట్టడంతోపాటు ఉగ్రవాదం ఎంత ప్రమాదకరమో ప్రధాని మోడీ ప్రపంచానికి చాటిచెప్పి బ్రిక్స్ దేశాలకు కర్తవ్యబోధ చేయడం ఎంతైనా హర్షదాయకం... అభినందనీయం.**

# పేద మహిళల అభివృద్ధికి ముఖ్యమంత్రి కృషి




రాష్ట్రంలో పేద మహిళల అభివృద్ధికి, వారి ఆర్థిక ప్రగతికి రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు కృషి చేస్తున్నారని తెలుగుదేశంపార్టీ రాష్ట్ర మాజీ కార్యదర్శి తాళ్ళపాక అనూరాధ పేర్కొన్నారు. ఆదివారం నెల్లూరులోని ఎన్టీఆర్ భవన్‌లో విలేకర్లతో ఆమె మాట్లాడుతూ డ్వాక్రా మహిళలకు రెండోదఫా రూ.2,800కోట్లు రుణమాఫీ చేసిన ఘనత చంద్రబాబునాయుడుకే దక్కుతుందన్నారు. మొదటి విడతగా రూ.3,500 కోట్లు గతంలోనే మాఫీ చేశారన్నారు. మహిళలు పారిశ్రామికవేత్తలుగా ఎదగాలని ఎన్నో పథకాలను తీసుకొస్తున్నా రని, రాయితీతో రూ.25 నుంచి రూ.30లక్షల వరకు బ్యాంకు రుణాలు ఇచ్చే పథకాలను ప్రభుత్వం అందజేస్తున్నా అవి పూర్తిస్థాయిలో ప్రజలకు తెలియడం లేదన్నారు. వీటిపై అవగాహన కల్పించి మహిళలకు ఆర్థిక ప్రగతి సాధించేందుకు జిల్లా వ్యాప్తంగా చైతన్యం కల్పిస్తామన్నారు. ఈ సమావేశంలో జిల్లా తెలుగు మహిళా ప్రధాన కార్యదర్శులు విజేత, భూలక్ష్మి, మహిళా కార్పొరేటర్లు బొల్లినేని శ్రీవిద్య, మేకల రజని, అంచూరు జానకి, కార్యనిర్వాహక కార్యదర్శి బి.వి.లక్ష్మి, జిల్లా ఉపాధ్యక్షురాలు బెల్లంకొండ వాణి, నెల్లూరు నగర తెలుగు మహిళా అధ్యక్షురాలు పొడమేకల శాంతి తదితరులు పాల్గొన్నారు.

# ఎస్‌ఐలకు స్థాన చలనం

జిల్లాలో పలువురు ఎస్‌ఐల బదిలీలు జరిగాయి. దీనికి సంబంధించి జిల్లా ఎస్పీ విశాల్‌గున్ని ఉత్తర్వులు జారీ చేశారు. విఆర్‌లో వున్న ఎస్‌ఐలు కె.ముత్యాలరావును వరికుంటపాడుకు, కె.వీరప్రతాప్‌ను వింజమూరుకు, ఎ.బాజిరెడ్డిని చేజర్లకు, ఎస్.భాస్కర్ బాబును ఏ.ఎస్.పేటకు, ఎ.సైదును కలువాయికి, ఎం.ఆంజనేయులను జలదంకికి, కె.శ్రీనివాసరావును సీతారాంపురంకు బదిలీ చేశారు. వరికుంటపాటులో వున్న కె.నాగార్జునను, వింజమూరులో వున్న కె.వేణుగోపాల్‌ను, చేజర్లలో వున్న ఎస్.కె.సుబానిని, వెంకటగిరిలో వున్న ఆంజనేయరెడ్డిని, కొడవలూరులో వున్న కె.వి.నారాయణరెడ్డిని విఆర్‌కు పంపారు. జలదంకిలో వున్న ఎం.అంజిరెడ్డిని కొడవలూరుకు, కలువాయిలో వున్న కె.కొండపనాయుడును వెంకటగిరికి, సీతారాంపురంలో వున్న పి.జిలానిబాషాను నెల్లూరు వన్‌టౌన్‌కు బదిలీ చేశారు.

# వ్యక్తిగత పరిశుభ్రత నిత్యం పాటించాలి



మన ఆరోగ్యం మన చేతుల్లో వుండాలంటే వ్యక్తిగత పరిశుభ్రత ప్రతినిత్యం క్రమం తప్పకుండా పాటించాలని నెల్లూరు జిల్లా స్వచ్ఛంధ సంస్థల అధ్యక్షుడు ఇ.వి.ఎస్.నాయుడు అన్నారు. ఈ నెల 15వ తేదీన రోటరీ క్లబ్ నెల్లూరు సౌత్, పినాకిని యూత్ వెల్ఫేర్ అసోసియేషన్ సంయుక్త ఆధ్వర్యంలో బుజబుజనెల్లూరులోని శ్రీనివాస అంగ్లీషు మీడియం స్కూలులో 'గ్లోబల్ హ్యాండ్‌వాష్ డే' సందర్భంగా 'పరిశుభ్రత' అనే అంశంపై అవగాహన సదస్సు జరిగింది. బాలభవన్ డైరెక్టర్ గోవిందరాజు సుభద్రాదేవి మాట్లాడుతూ ప్రతిఒక్కరు అపరిశుభ్రత వల్ల రోగాల బారిన పడుతూ ఆసుపత్రుల పాలవుతున్నారన్నారు. ఆరోగ్యం కాపాడుకోవాలంటే గోరువెచ్చని నీటిని సేవిస్తూ ఆహారం తినకముందు, తర్వాత సబ్బుతో చేతులు కడుక్కోవాలన్నారు. పినాకిని యూత్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు కె.మురళీమోహన్‌రాజు, ఉపాధ్యాయుడు హరికృష్ణ, రవి గోగులపల్లి, ఓరుంపాటి హరికృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.




## అభివృద్ధి జాడలేవీ?

రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు నోట అభివృద్ధి మాటను పదేపదే వింటుంటాం. ఈమధ్య ప్రతిదీ నేనే చేసానని చెప్పుకోవడం బాగా అలవాటైపోయింది. అభివృద్ధి అంటే ఆయా రంగాలలో ఉత్పాదన పెరగడం, మౌలిక వసతులు పెంచడం, ఉపాధి అవకాశాలను మెరుగుపరచడం వంటివి! ఈ అంశాలకు ప్రాధాన్యతనిచ్చే పనులేం చేసారాయన? అమరావతి రాజధాని పేరుతో బంగారం లాంటి భూములను నాశనం చేయడం వల్ల వేలసంఖ్యలో రైతులు, రైతు కూలీలు పని పాటా లేకుండా ఖాళీగా కూర్చుంటున్నారు. ఆయన చేసిన అభివృద్ధి ఇదా?

**– జి.సతీష్, హైదరాబాద్.**

## విద్యాసంస్థల్లో హింసోన్మాదం

మీడియా విచ్చలవిడి తనం వల్ల చిన్న పిల్లల్లోనూ విషబీజాలు నాటుకుంటున్నాయి. నేర ప్రవృత్తిని హీరోయిజం అనుకుంటున్నారు. ఇటీవల హైదరాబాద్‌లోని చైతన్య స్కూల్‌లో కొందరు విద్యార్థులు కలిసి తమ సహ విద్యార్థిని క్లాసురూంలోనే చావగొట్టారు. ఆ విద్యార్థి అపస్మారక స్థితిలోకి వెళ్లాడు. సోషల్ మీడియాలో ఈ సంఘటనను కోట్లాదిమంది చూసారు. ఏమిటీ వైపరీత్యాలు. చదువుకోవాల్సిన వయస్సులో ఈ పెడధోరణులు, వెధవ బుద్ధులేంటి? తల్లిదండ్రుల పెంపకం దారి తప్పుతోంది. వారిని చిన్నతనం నుండే సరైన పద్ధతిలో పెంచాలి.

**– సి.అన్నపూర్ణ, నెల్లూరు.**

## మానవత్వమే దైవం

ఇటీవల స్వరూపానందస్వామి సాయిబాబా దేవుడే కాదని, ఆయనను పూజించవద్దని చెప్పి సంచలనం సృష్టించారు. ఇక్కడ దేవుడు ఎవరు అన్నది ముఖ్యం కాదు. ఏసి గదుల్లో స్వర్గసుఖాలు అనుభవిస్తూ నీతి బోధలు చేసేవాళ్లు దేవుళ్లు కాలేరు. మంచి, మానవత, నలుగురికి సాయం చేసే గుణం వున్న ప్రతి మనిషి కూడా దేవుడే అవుతాడు. ఈ లెక్కన సాయిబాబా దేవుడే! ఆయనను పూజించవద్దు అని చెప్పడానికి ఆయన చేసిన తప్పులేంటో చూపండి!

**– డి.సరోజిని, నెల్లూరు.**

## ఉదయగిరిలో...

# పడిపోతున్న 'దేశం' గ్రాఫ్

### బొల్లినేనికి 'సియం' అక్షింతలు



*ఉదయగిరి నియోజకవర్గంలో తెలుగుదేశం పార్టీ పరిస్థితి రోజు రోజుకు దిగజారిపోతూ పార్టీ అధినేతను ఆందోళనకు గురిచేస్తుంది.*

ప్రయివేటు సర్వే ఏజన్సీల ద్వారా ఎప్పటి కప్పుడు నియోజకవర్గాలలో పార్టీ పరిస్థితిని అంచనావేసి ఆ నియోజకవర్గాలకు ప్రతి నిత్యం వహిస్తున్న నాయకులకు సూచనలు, సలహాలు ఇవ్వడం చంద్రబాబుకు అలవాటు. ఈ క్రమంలో ఇటీవల విజయవాడలో నిర్వహించిన సమావేశంలో ఉదయగిరిలో పార్టీ పనితీరుపై చంద్రబాబు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేసినట్లు దేశం వర్గాలలో విస్తృతప్రచారం జరుగుతోంది. చంద్రబాబు వద్ద వున్న సమాచారం మేరకు ఉదయగిరిలో పార్టీ పరిస్థితి '0'గా ఉందని, పరిస్థితి ఇలాగే కొనసాగితే వచ్చే ఎన్నికల్లో పార్టీ టిక్కెట్ కూడా ఇవ్వలేమని ఎమ్మెల్యే బొల్లినేనిని ముఖ్యమంత్రి హెచ్చరించినట్లు తెలుస్తోంది. మొత్తం 8మండలాలకు సంబంధించి తన వద్దవున్న సమాచారాన్ని పోల్చిచూస్తూ... పరిస్థితి దిగజారడానికి మీ పనితీరే కారణమని సియం గట్టిగా మందలించడంతో బొల్లినేని అయోమయంలో పడినట్లు సమాచారం.

ఎమ్మెల్యేగా 2 సంవత్సరాలు పూర్తి చేసుకుని మూడవ సంవత్సరంలో అడుగు పెట్టినప్పటికీ.. నియోజకవర్గంలోని ప్రజలు ఆయనను ఇప్పటికి కూడా పూర్తిగా చూసిన దాఖలాలు లేవన్న నివేదికల సారాంశం ఎమ్మెల్యేని ఆత్మరక్షణలో పడేసింది. ఏ ఒక్క మండలంలో కూడా పార్టీ బలంగా ఉంది అని చెప్పేందుకు ఆస్కారం కలగడం లేదు. 8 మండలాల్లో కొండాపురం ఆదినుండి తెలుగుదేశం పార్టీకి కంచుకోటగా ఉండేది. కలిగిరి, జలదంకి మండలాలు తొలుత కాంగ్రెస్‌కు, అనంతరం వైకాపా ఆవిర్భావంతో ఆ పార్టీని ఆదరిస్తూ వస్తున్నాయి. ఇక వరికుంటపాడులో సుంకర కుటుంబం పట్టు కలిగివుంది. దుత్తలూరు మండలం మాజీఎమ్మెల్యే కంభం విజయరామిరెడ్డిని అనుసరిస్తుంది. వింజమూరు, ఉదయగిరి, సీతారామపురం మండలాలలో వర్గ రాజకీయాల ప్రాతిపదికన ఇరు పార్టీలు ఉనికిని చాటుకుంటున్నాయి. ఇటువంటి పరిస్థితులలో సొంత మండలం కలిగిరిలో కూడా ఎమ్మెల్యేకి పాస్ మార్కులు రాకపోవడం చంద్రబాబును సైతం ఆశ్చర్యానికి గురిచేసినట్లు తెలుస్తోంది. కేవలం జలదంకి మండలం చిప్పలేరు వద్ద నిర్మించిన ఫైబర్ చెక్ డ్యాం తప్ప నియోజకవర్గంలో చెప్పుకోదగ్గ ఒక్క అభివృద్ధి పనికూడా లేకపోవడం విశేషం.

ఎన్నికల్లో గ్రామాల అభివృద్ధికి ఇచ్చిన హామీలను మరిచారని, నియోజకవర్గంలో ఇంకా కొన్ని గ్రామాలవైపు కన్నెత్తి చూడలేదనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. పలు గ్రామాలలో గత ఎన్నికలలో బొల్లినేని గెలుపుకు కష్టించిన ఇతర సామాజిక వర్గాలవారిని ప్రక్కన పెట్టి కేవలం ఎమ్మెల్యే సొంత కులం వారికి అన్నింటా అగ్రపీఠం వేస్తుండటం మిగిలిన సామాజిక వర్గాలవారిని అసంతృప్తికి గురిచేయడంతో వారు క్రమ క్రమంగా పార్టీకి దూరమైపోతున్నారు.

# జడ్.యస్. ఇంట్లో ఎక్సైజ్ మంత్రి



నెల్లూరు నగరపాలకసంస్థ ఫ్లోర్‌లీడర్ డాక్టర్ జడ్.శివప్రసాద్ సోమవారం ఇస్కాన్‌సిటీలోని తన నివాసంలో రాష్ట్ర ఎక్సైజ్, బి.సి వెల్ఫేర్ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర గౌరవార్థం అల్పాహార విందు ఏర్పాటు చేశారు. మంత్రి రవీంద్రను డాక్టర్ జడ్.యస్ శాలువాతో సత్కరించి ఆహ్వానించారు. ఈ అల్పాహారవిందుకు శాసన మండలి సభ్యులు సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి, బీద రవిచంద్ర, వాకాటి నారాయణరెడ్డి, ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ, మాజీఎమ్మెల్యే ముంగమూరు శ్రీధరకృష్ణారెడ్డి, విజయ డెయిరీ ఛైర్మెన్ కొండ్రెడ్డి రంగారెడ్డి, జిల్లా గ్రంథాలయ సంస్థ ఛైర్మెన్ కిలారి వెంకటస్వామినాయుడు, మాజీ మున్సిపల్ ఛైర్‌పర్సన్ టి.అనూరాధ, ఆసుపత్రుల అభివృద్ధి కమిటి ఛైర్మెన్ చాట్ల నరసింహారావు, బీజేపీ జిల్లా అధ్యక్షులు పి.సురేంద్రరెడ్డి, తెలుగుదేశం నాయకులు ఆనం జయకుమార్‌రెడ్డి, కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డి, సన్నపరెడ్డి పెంచలరెడ్డి, గూటూరు కన్నబాబు, డాక్టర్ బి.జ్యోత్స్నలత, నాగరాజు, వేనాటి రామ చంద్రారెడ్డి, బి.మనోహర్‌రెడ్డి, టి.గిరినాయుడు, య్రరంరెడ్డి గోవర్ధనరెడ్డి, అన్నం దయాకర్‌గౌడ్, ధర్మవరం సుబ్బారావు, పి.కృష్ణమూర్తి తదితరులు హాజరయ్యారు.

## సర్వేపల్లి కేంద్రంగా...

# రగులుతున్న గ్రావెల్ వార్...





*నువ్వు దొంగ... కాదు నువ్వే దొంగవు... అక్రమ గ్రావెల్ తవ్వకాలు నీవే... నాకంటే ఎక్కువ తవ్వకాలు నీవే... ఇదీ సర్వేపల్లి నియోజకవర్గంలో ప్రస్తుత రాజకీయ పరిస్థితి. అధికారపక్ష, విపక్షాల మధ్య ఇక్కడ గ్రావెల్ యుద్ధం ముమ్మరంగా జరుగుతోంది. నాయకుల పరస్పర విమర్శలతో ఇక్కడ రాజకీయాలు వేడెక్కాయి.*

జిల్లాలో గ్రావెల్ క్వారీలు ఎక్కువుగా వున్న ప్రాంతాల్లో వెంకటాచలం మండలం ఒకటి! కొన్నేళ్ల క్రితం గ్రావెల్‌కు పెద్దగా విలువ వుండేది కాదు. జాతీయ రహదారి విస్తరణతో పాటు కృష్ణపట్నం పోర్టు రావడం, పలు ఫ్యాక్టరీలు, థర్మల్ విద్యుత్ కేంద్రాలు రావడం, కృష్ణపట్నం నుండి ఓబులాయపల్లె వరకు రైల్వేలైన్ నిర్మాణం జరుగుతుండడంతో గ్రావెల్ బంగార మైంది. ప్రతిపనికీ గ్రావెల్ ప్రధాన అవసరంగా మారింది. గత కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో అయితే కేవలం గ్రావెల్ తవ్వకాల ద్వారానే నాయకులు వారి అనుచరులు కోట్లాది రూపాయలు కొల్లగొట్టారు. అనుమతి పొందిన భూముల్లోనే కాకుండా అనుమతుల్లేని ప్రభుత్వ ప్రైవేట్ భూముల్లో సైతం గ్రావెల్ తవ్వకాలు జరిపి, మైనింగ్‌ను పెద్ద మాఫియాగా మార్చారు. ప్రభుత్వాలు మారినా ఈ మండలంలో గ్రావెల్ తవ్వకాల జోరు మాత్రం తగ్గలేదు. ఓ పక్క అధికారపార్టీ వాళ్లతో పాటు మరోపక్క విపక్ష పార్టీ నేతలు కూడా ఈ మండలంలో గ్రావెల్ తవ్వకాలు, అమ్మకాలు జరుపుతున్నారు. దీనిపైనే తెలుగుదేశం, వైకాపా నాయకుల మధ్య విమర్శల యుద్ధం జరుగుతోంది. ఇటీవల జిల్లా పరిషత్ సాధారణ సర్వసభ్య సమావేశంలో అక్రమ మైనింగ్‌పై వైకాపా సభ్యులే ధ్వజమెత్తారు. అధికారపార్టీ నాయకులు అక్రమ మైనింగ్‌కు పాల్పడుతున్నారంటూ ఆరోపించారు. జడ్పీ సమావేశం ముగిసిన రెండోరోజే మైనింగ్ అధికారులు వైకాపా జడ్పీటీసీకి సంబంధించిన మూడు టిప్పర్లను అనుమతి లేకుండా గ్రావెల్ తోలుతున్నారంటూ సీజ్ చేశారు. ఇది పెద్ద వివాదమైంది. దీనిపై తెలుగుదేశం నాయకులు విరుచుకు పడ్డారు. అక్రమ మైనింగ్‌పై ఆరోపణలు చేసేదీ మీరే, అక్రమంగా గ్రావెల్ రవాణా చేసేదీ మీరేనంటూ విమర్శలకు దిగారు. మరోపక్క సర్వేపల్లి ఎమ్మెల్యే కాకాణి గోవర్ధన్‌రెడ్డి తన అనచరులకు మద్దతుగా నిలిచారు. తమ వాళ్లు అన్నీ అనుమతులు పెట్టుకునే మైనింగ్ చేస్తున్నారని, అధికార పార్టీ ఒత్తిళ్లకు లొంగి మైనింగ్ శాఖాధికారులు తమ వాళ్లపై అక్రమ కేసులు బనాయిస్తున్నారని, ఈ విషయాన్ని బహిరంగంగానే నిరూపిస్తానని కాకాణి సవాల్ విసురుతున్నారు.

రాజకీయ విమర్శలను పక్కన పెడితే వెంకటాచలం మండలంలో గ్రావెల్ తవ్వకాలకు ఒక పద్ధతి పాడూ లేకుండా పోయింది. స్థానికంగా బిగ్రున్న నాయకులు, అనుచరులు మైనింగ్ శాఖను ఏ మాత్రం లెక్కచేయకుండా కోట్లాది రూపాయల విలువ చేసే గ్రావెల్‌ను కొల్ల గొడుతున్నారన్నది నగ్నసత్యం.

# నెల్లూరులో పబ్ కల్చర్

**వివాదంగా మారిన సింధూర బార్ & రెస్టారెంట్**

ఇంతవరకు మహానగరాలకే పరిమితమైన పబ్ సంస్కృతి ఇప్పుడు నెల్లూరుకు పాకింది. నెల్లూరు ఆర్టీసీ బస్టాండ్ సమీపంలో పాత సింధూర బార్ & రెస్టారెంట్ ప్రాంగణంలో సింధూర పబ్‌ను ఏర్పాటు చేయడం వివాదానికి దారి తీసింది. ఎక్సైజ్ శాఖ అనుమతితోనే తాము పబ్‌ను ప్రారంభించామని నిర్వాహకులు చెబుతుండగా, సోమవారం నెల్లూరులో పర్యటించిన రాష్ట్ర ఎక్సైజ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర మాత్రం ఈ పబ్‌పై చర్యలు తీసుకోవాలని ఎక్సైజ్ శాఖను ఆదేశించడం జరిగింది. తెలుగునాడు విద్యార్థి సంఘం, వైకాపా విద్యార్థి విభాగంతో పాటు పలు విద్యార్థి సంఘాలు ఈ పబ్‌ను మూసేయాలంటూ పబ్ ఎదుటే ఆందోళనకు దిగాయి. మంగళవారం రాత్రి నాలుగోనగర పోలీసులు ఈ పబ్‌ను ఆకస్మికంగా తనిఖీ చేసి తాత్కాలికంగా మూసేయించారు. అయితే ఎవరి అనుమతీ లేకుండానే నిర్వాహకులు ఈ పబ్‌ను ఎలా ప్రారంభించగలిగారన్నది ప్రశ్నార్థకంగా మారింది. పబ్ నిర్వాహకులు మాలకొండారెడ్డి మంగళవారం మీడియా ముందు పబ్‌కు సంబంధించిన అనుమతులంటూ కొన్ని పత్రాలు చూపించారు. అయితే ఎక్సైజ్ సూపరింటెండెంట్ బలరామకృష్ణ మాత్రం నెల్లూరు నగరంలో పబ్‌లకు అనుమతి ఇవ్వలేదని, నిబంధనలకు విరుద్ధంగా పబ్‌లు నిర్వహిస్తే, కేసులు నమోదు చేసి చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. సోమవారం ఎక్సైజ్ మంత్రి కొల్లు రవీంద్ర ఎక్సైజ్ అధికారులతో జరిపిన సమీక్షలో సైతం ఈ పబ్ విషయం చర్చకు వచ్చింది.

మరి ఎక్సైజ్ అధికారులు అనుమతులివ్వకా? ఎక్సైజ్ మంత్రికీ తెలియక సింధూర పబ్‌కు ఎవరు అనుమతులిచ్చినట్లు? అసలు అనుమతి లేకుండా నిర్వాహకులు అంత ధైర్యంగా పబ్‌ను ప్రారంభించగలరా? నిజం తొందర్లోనే బయటపడొచ్చు.


అధునాతన గృహోపకరణాలకు చిరునామా
అమ్మ ఫర్నిచర్ మాల్
మినీబైపాస్‌రోడ్, నెల్లూరు.
Latest & New Models
ప్రతి కొనుగోలు పై డిస్కౌంట్ కలదు



# నెల్లూరు కబుర్లు

## వివేకా లేని రొట్టెల పండుగ!



ఈ ఏడాది నెల్లూరులో జరిగిన రొట్టెల పండుగలో ప్రధానంగా కనిపించిన లోటు మాజీఎమ్మెల్యే ఆనం వివేకానందరెడ్డి లేకపోవడం. నెల్లూరులో జరిగే రంగనాథ స్వామి తిరునాళ్లు, గొబ్బెమ్మల పండుగ, గుడ్‌ఫ్రైడే, రొట్టెల పండుగలంటే బాగా ఇష్టం. ఈ పండుగల్లో ఒళ్లంతా పూసుకుని పాల్గొంటుంటాడు. రొట్టెల పండుగ జరిగే నాలుగురోజులైతే అక్కడే తింటూ అక్కడే పడుకుంటూ అక్కడి ముజావర్లలో ఒకడుగా కలిసిపోతాడు. కాని ఈ ఏడాది ఆరోగ్య కారణాల రీత్యా హైదరాబాద్‌లోనే ఉండిపోవడంతో రొట్టెల పండుగలో పాల్గొనలేక పోయారు. నాలుగేళ్ల క్రితం కూడా ఆరోగ్యరీత్యా హైదరాబాద్‌లో ఉండిపోవడంతో రొట్టెల పండక్కి రాలేకపోయారు. ఆయనకు వూహ తెలిసాక రొట్టెల పండక్కి రాలేకపోవడం ఈ రెండుసార్లే చోటుచేసుకుంది.

## అపోలోలో క్యాన్సర్ స్క్రీనింగ్ ప్యాకేజీ



అక్టోబర్ నెలను రొమ్ము క్యాన్సర్ అవగాహన మాసంగా ప్రకటించిన నేపథ్యంలో ఈ నెల 15వ తేదీన నెల్లూరులోని అపోలో స్పెషాలిటీ హాస్పిటల్‌లో నెల్లూరు మహిళల కోసం క్యాన్సర్ స్క్రీనింగ్ ప్యాకేజీని 999 రూపాయలకే విడుదల చేశారు. మన దేశంలో ప్రతి సంవత్సరం లక్షా 50వేల మంది మహిళలు రొమ్ము క్యాన్సర్ బారిన పడుతున్నారని, 70వేల మంది ఈ వ్యాధితో మృతి చెందుతున్నారని ఈ కార్యక్రమంలో పాల్గొన్న అపోలో వైద్యులు వెల్లడించారు. వ్యాధిని సకాలంలో గుర్తించలేకపోవడం, క్యాన్సర్‌పై అవగాహన లేకపోవడం వల్లే ఇలా జరుగుతుందన్నారు. మారుతున్న జీవనశైలి, వయసు మీరిన తర్వాత ప్రసవించడం, తల్లిపాలు ఇవ్వకపోవడం వంటి కారణాల వల్ల ఈ వ్యాధిగ్రస్తుల సంఖ్య పెరుగుతోందని, ఈ వ్యాధిని తొలి దశలోనే గుర్తిస్తే నివారించవచ్చని వారు పేర్కొన్నారు.

ఈ కార్యక్రమంలో మాజీమేయర్ ఎన్.భానుశ్రీ, మాజీ మున్సిపల్ ఛైర్‌పర్సన్ టి.అనూరాధ, బాలభవన్ డైరెక్టర్ జి.సుభద్రాదేవి, ప్రముఖ గైనకాలజిస్టు డాక్టర్ పి.యశోధర, రెయిన్‌బో స్కూల్ డైరెక్టర్ పద్మాసుబ్రహ్మణ్యం, నేతాజీ(యంయస్ఆర్) పైలట్ స్కూల్ హెడ్మాస్టర్ ఎం.ప్రసన్న, లయన్స్ క్లబ్ మహిళా విభాగాలకు చెందిన సుప్రజ, డాక్టర్ లహరి, ప్రియదర్శిని, వాసవి క్లబ్ అధ్యక్షురాలు లక్ష్మీ, అవోపా మహిళా విభాగం అధ్యక్షురాలు రూపాలక్ష్మి, డాక్టర్ ఆండాల్ భాస్కర్ అపోలో వైద్య నిపుణులు డాక్టర్ శ్వేతారెడ్డి, డాక్టర్ హరిత, డాక్టర్ మాతూరి రమేష్, డాక్టర్ గాయత్రి, డాక్టర్ అనిత, అపోలో యూనిట్ హెడ్ నవీన్, పిఆర్ఓ విజయకుమార్ తదితరులు పాల్గొన్నారు.

## ఏసి వాకర్స్‌కు గుడ్లు



ప్రపంచ గుడ్డు దినోత్సవం సందర్భంగా నెల్లూరు ఏ.సి.సుబ్బారెడ్డి స్టేడియం వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నలుబోలు బలరామయ్యనాయుడు సహకారంతో 14వ తేదీ స్టేడియంలో వాకర్స్‌కు గుడ్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా బలరామయ్యనాయుడు మాట్లాడుతూ గుడ్డు తినడం ద్వారా శరీరంలో దృఢత్వం పెరిగి ఆరోగ్యంగా ఉంటారన్నారు. ప్రతి ఒక్కరు రోజుకో గుడ్డు తినాలన్నారు. చిన్నతనం నుంచే పిల్లలకు గుడ్డు తినడం అలవాటు చేయాలన్నారు. అసోసియేషన్ అధ్యక్షుడు వేలూరు రంగారావు, కార్యదర్శి స్వర్ణ రమేష్‌బాబు, రవిచంద్ర, డాక్టర్ అంకిరెడ్డి పాల్గొన్నారు.

## రైల్వేకు రూ.90లక్షలకు పైగా ఆదాయం

నెల్లూరు బారాషాహీద్ దర్గా వద్ద ఈ నెల 12 నుంచి 16వ తేదీ వరకు జరిగిన రొట్టెలపండుగ సందర్భంగా వివిధ ప్రాంతాల నుంచి నెల్లూరుకు రైళ్లలో వచ్చిన ప్రయాణీకుల ద్వారా రైల్వేశాఖకు రూ.90లక్షలకు పైగా ఆదాయం వచ్చినట్లు నెల్లూరు చీఫ్ కమర్షియల్ ఇన్స్‌పెక్టర్(సిసిఐ) సతీష్ తెలిపారు. రొట్టెల పండుగకు రైళ్లలో దాదాపు లక్ష మందికిపైగా నెల్లూరుకు రాకపోకలు సాగించారని తెలిపారు. ప్రయాణీకులకు అవసరమైన సేవలు అందించేందుకు రైల్వే అధికారులు, సిబ్బంది కృషి చేశారన్నారు. ప్రయాణీకులకు అన్ని విధాల ఏర్పాట్లు చేసి సహకరించిన రైల్వే అధికారులు, సిబ్బంది, పారిశుద్ధ్య సిబ్బందికి ధన్యవాదాలు తెలిపారు.

# అమ్మవారికే శఠగోపం



**దసరా నవరాత్రులంటే నెల్లూరులో భక్తులందరూ మొదటగా దర్శించుకునేది దుర్గామిట్టలోని శ్రీ రాజరాజేశ్వరి అమ్మవారినే! ఇక్కడ దేవీ శరన్నవరాత్రులు ఎంతో వైభవంగా జరుగుతుంటాయి.**

ప్రజాప్రతినిధులు, అధికారులు కూడా ఎంతో ప్రతిష్టాత్మకంగా ఈ ఉత్సవాల నిర్వహణలో పాలుపంచుకుంటుంటారు. ప్రతి ఏటా నవరాత్రుల సమయంలో విఐపిల తాకిడి ఎక్కువుగా ఉంటుంది. దీనివల్ల సాధారణ భక్తులకు అమ్మవారి దర్శనం కష్టంగా ఉండేది. ఈ ఏడాది ఈ పద్ధతికి నెల్లూరు గ్రామీణ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి చెక్‌పెట్టారు. తన నియోజకవర్గ పరిధిలో వున్న దేవస్థానంలో ఎమ్మెల్యేగా ఆయనకు వివిఐపి ప్రోటోకాల్ ఉన్నప్పటికి సాధారణ భక్తుల క్యూలో వెళ్లి అమ్మవారిని దర్శించుకుని మిగతా వారికి ఆదర్శప్రాయంగా నిలిచారు. ఆయనను చూసాకే చాలామంది విఐపిలు కూడా అడ్డదారుల్లో కాకుండా వందరూపాయల టిక్కెట్లు కొనుక్కుని అమ్మవారి దర్శనం చేసుకున్నారు. తద్వారా ఈసారి దేవస్థానానికి ప్రత్యేక దర్శనం టిక్కెట్ల రూపంలో ఆదాయం బాగానే పెరిగింది. అయితే ఇంకా పెరిగి ఉండాల్సిన ఆదాయానికి ఆలయ ఇఒ, ప్రైవేటు వ్యక్తులతో కలిసి గండి కొట్టినట్లు తెలుస్తోంది. వంద రూపాయలు, 50రూపాయల ప్రత్యేక, శీఘ్ర దర్శనం టిక్కెట్లను భక్తులు క్యూలైన్లలోకి వెళ్లేటప్పుడు తీసుకుని చించేయాలి. కాని వీరు ఆ టిక్కెట్లను చించేయకుండా తిరిగి మళ్లీ భక్తులకు అమ్మి సొమ్ము చేసుకున్నట్లు తెలుస్తోంది. దీని వల్ల ఒక్కో టిక్కెట్ మీద ఒకరికి మించి ఎంత మందైనా దర్శనం చేసుకోవచ్చు. ఒక టిక్కెట్ వల్ల దేవస్థానానికి వచ్చిన ఆదాయం వంద రూపాయలైతే, ఈ టిక్కెట్‌ను రెండు మూడు సార్లు తిప్పితిప్పి అమ్మడం వల్ల వీరికి వచ్చిన ఆదాయం మూడొందలు నుండి నాలుగొందల వరకు వుంది. ఇలా వందల సంఖ్యలో దర్శనం టిక్కెట్లను తిప్పితిప్పి అమ్మినట్లు సమాచారం. అలాగే ప్రసాదం టిక్కెట్ల విషయంలోనూ ఇదే గోల్‌మాల్ చేశారు. ఇక అమ్మవారికి పట్టువస్త్రాలు సమర్పించే కార్యక్రమంలోనూ ఇ.ఓ ప్రోటోకాల్ పాటించలేదని తెలుస్తోంది.

ఆలయంలో జరిగిన నిర్వాకం మున్సిపల్ మంత్రి పి.నారాయణ దాకా వెళ్లినట్లు సమాచారం. అలాగే వీరి వ్యవహారశైలిపై ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి, రూరల్ టీడీపీ ఇన్‌ఛార్జ్ ఆదాల ప్రభాకర్‌రెడ్డి కూడా ఆగ్రహంతో వున్నారు. అమ్మవారి వద్ద ఇలాంటి వేషాలు వేసినవాళ్లెవరూ సంతోషంగా లేరు. వీళ్ల సంగతి ఆ రాజరాజేశ్వరి తల్లే చూసుకుంటుందని భక్తులంటున్నారు.

## 45 లక్షలకు పైగా దసరా ఆదాయం

శ్రీ రాజరాజేశ్వరి అమ్మవారి ఆలయానికి ఈ సారి దసరా ఉత్సవాల సందర్భంగా ఆదాయం బాగానే వచ్చింది. దర్శనం టిక్కెట్ల విక్రయం ద్వారా ఆలయానికి 26,90,453 రూపాయలు, ఆలయంలోని హుండీల ద్వారా 18,69,791 రూపాయలు వచ్చిందని ఆలయ నిర్వాహకులు తెలిపారు. ఈ నెల 15న జరిగిన ఈ లెక్కింపులో మొత్తంగా 45,60,244 రూపాయలు వచ్చినట్లు పేర్కొన్నారు. ఈ లెక్కింపులో ఆలయ ఇ.ఓ కోదండరామిరెడ్డి, ఇన్స్‌పెక్టర్ శైలేంద్ర, దేవస్థానం వ్యవస్థాపక ఛైర్మెన్ రత్నం జయరాంతో పాటు అర్చకులు, సిబ్బంది పాల్గొన్నారు.

## బాధ్యతలు తీసుకున్న ఆర్.కె.

నెల్లూరు రెండోనగర సిఐగా కె.రామకృష్ణారెడ్డి 17వ తేదీ బాధ్యతలు స్వీకరించారు. ఆ తర్వాత ఆయన ఎస్పీ విశాల్ గున్నీని మర్యాద పూర్వకంగా కలిసారు. రామకృష్ణారెడ్డి సిసిఎస్ నుండి బదిలీపై టూటౌన్‌కు రాగా, ఇక్కడున్న సుధాకర్‌రెడ్డి సిసిఎస్‌కు బదిలీ అయ్యారు.

## డికెడబ్ల్యుకి 7 ప్రతిభా పురస్కారాలు

రాష్ట్ర ప్రభుత్వం డిగ్రీ స్థాయి విద్యార్థులకు ఇచ్చే ప్రతిభా పురస్కారాల్లో ఏడు పురస్కారాలను ఈ సారి నెల్లూరులోని డికెడబ్ల్యు కళాశాలకు చెందిన విద్యార్థినులు సొంతం చేసుకోవడం ఎంతో విశేషం. జిల్లాకు మొత్తం 24 పురస్కారాలు లభించగా ఇందులో ఏడు పురస్కారాలు తమ కళాశాలకే లభించడం తమకెంతో ఆనందంగా వుందని ఆ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ శైలజ హర్షం వ్యక్తం చేశారు. పురస్కారాలు లభించిన బి.అజిత, ఎన్.ప్రసన్న, ఎన్.గౌతమి, ఎం.మమత, వి.శ్రావణి, పి.నాగలక్ష్మి, కె.స్వప్నలను ఆమె ఈ సందర్భంగా అభినందించారు. పురస్కారాలు అందుకున్న విద్యార్థినులను సహచర విద్యార్థినులు, ఉపాధ్యాయులు అందరూ ప్రశంసించారు.

## మళ్ళీ వాయిదా పడ్డ రెవెన్యూ ఎన్నికలు


నెల్లూరు రూరల్ మండలం తహశీల్దార్ కార్యాలయంలో ఆదివారం జరగాల్సిన నెల్లూరు డివిజన్ రెవెన్యూ అసోసియేషన్ ఎన్నికలు మళ్ళీ వాయిదా పడ్డాయి. ఏపిఆర్ఎస్ఏ జిల్లా కార్యవర్గం నెల్లూరు డివిజన్ ఎన్నికలకు సంబంధించి ఏర్పాటు చేసిన ఎన్నికల అధికారి కాయల సతీష్ కుమార్ ఎన్నికల ప్రక్రియకు హాజరు కాకపోవడంతో వాయిదా వేసినట్లు ఆ సంఘం నాయకులు తెలిపారు. నోటిఫికేషన్ ప్రకారం ఉదయం 9గంటల నుంచి 11గంటల వరకు నామినేషన్ల ప్రక్రియ జరగాల్సి వున్నా నిర్వహించలేదన్నారు. ఇదివరకే పలుసార్లు ఎన్నికలు వాయిదా పడడంతో జిల్లా కార్యవర్గం పటిష్టత దెబ్బతింటోందని అసోసియేషన్ నాయకులు వాపోతున్నారు.

## టిడిపి మద్దతున్న అభ్యర్థిని గెలిపించాలి



రాయలసీమ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు బలపరిచే వ్యక్తిని అందరూ కలిసి గెలిపించాలని నెల్లూరు నగర 12వ డివిజన్ కార్పొరేటర్ ఆనం రంగమయూర్ రెడ్డి పేర్కొన్నారు. ఆదివారం నెల్లూరు చిల్డ్రన్స్‌పార్క్ వద్ద టిఎన్ఎస్ఎఫ్ ఆధ్వర్యంలో జరిగిన పట్టభద్రుల ఓటర్ల నమోదు హెల్ప్ డెస్క్ కార్యక్రమంలో పాల్గొని ఆయన మాట్లాడుతూ డిగ్రీ పూర్తిచేసిన ప్రతి విద్యార్థి, మేధావులు అందరూ వచ్చే నెల 5వ తేదీలోపు ఫారం-18ని పూర్తి చేసి స్థానిక తహశీల్దార్ కార్యాలయంలో ఇవ్వాలని కోరారు. మంచి వ్యక్తులను ఎమ్మెల్సీలుగా ఎన్నుకోవాల్సిన బాధ్యత పట్టభద్రుల మీద ఉందన్నారు. టిఎన్ఎస్ఎఫ్ ఆధ్వర్యంలో నెల్లూరు నగరంలోని ప్రధాన కూడళ్లలో సహాయ కేంద్రాలు ఏర్పాటు చేసామని, నగర పట్టభద్రులు ఉపయోగించుకుని తెలుగుదేశంపార్టీ బలపరిచే ఎమ్మెల్సీ అభ్యర్థిని గెలిపించాలని కోరారు. టిడిపి నాయకులు శిరిగిరి చక్రవర్తి, ముజీర్, మునావీర్, సుబ్రహ్మణ్యం, ముజీర్, ఎజాస్, ప్రేమకుమార్‌రెడ్డి, షమీమ్, అబూ, రాజా, బాలు తదితరులు పాల్గొన్నారు.

## బళ్ల వద్ద మద్యం అంగళ్లు వద్దు



విద్యా సంస్థలకు సమీపంలో మద్యం దుకాణాలున్నాయని, వాటిని మరో చోటకు తరలించాలని కోరుతూ టిఎన్ఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు కాకర్ల తిరుమల నాయుడు రాష్ట్ర ఎక్సైజ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్రకు వినతి పత్రం సమర్పించారు. 17వ తేదీ నెల్లూరు ఇస్కాన్‌సిటీలో తెలుగుదేశంపార్టీ జిల్లా అధికార ప్రతినిధి డాక్టర్ జడ్.శివప్రసాద్ నివాసానికి మంత్రి అల్పాహార విందుకు విచ్చేసిన సందర్భంగా తిరుమలనాయుడు ఈ వినతిపత్రం ఇచ్చారు. దీనిపై స్పందించిన మంత్రి రవీంద్ర విచారించి నిర్ణయం తీసుకుంటామని హామీ ఇచ్చారు. వినతిపత్రం ఇచ్చిన వారిలో అమ్ములు, సాయికిషోర్, మోనురాజ్ తదితరులు పాల్గొన్నారు.

# చేనేతలకు చేయూత

## - మంత్రి కొల్లు రవీంద్ర



రాష్ట్ర ప్రభుత్వం చేనేత కార్మికుల అభివృద్ధికి పెద్దపీట వేసిందని రాష్ట్ర చేనేత, వెనుకబడిన సంక్షేమం, ఎక్సైజ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర అన్నారు. సోమవారం నెల్లూరు ఆర్ అండ్ బి అతిథిగృహంలో ఆయన పాత్రికేయులతో మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చేనేత కార్మికులకు నిర్దేశించిన పథకాలను పకడ్బందీగా అమలు చేస్తున్నట్లు తెలియజేశారు. నెల్లూరుజిల్లాలో 9 చేనేత కస్టర్లను ఏర్పాటు చేయడం జరుగుతుందన్నారు. చేనేత కార్మికులకు గృహనిర్మాణం ప్రక్కనే వర్కింగ్ షెడ్‌ను నిర్మించేటట్లు ప్రణాళికలు సిద్ధం చేసినట్లు చెప్పారు. నెల్లూరుజిల్లాలో చేనేత బజారును నెలకొల్పడంతో పాటు మెగా షోరూంను కూడా ఏర్పాటు చేయనున్నట్లు మంత్రి తెలిపారు. బి.సిల సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం బి.సి సబ్‌ప్లాన్ క్రింద అన్ని కులాల వారికి న్యాయం చేసే విధంగా చర్యలు తీసుకొంటుందన్నారు. చేనేత కార్మికులకు ఇచ్చే రాయితీలను మంత్రి తెలియజేస్తూ యార్న్ సబ్సిడీ ఇవ్వడంతో పాటు చేనేత వస్త్రాలను రిబేటుతో అమ్మేటట్లు ప్రోత్సహిస్తున్నట్లు తెలియజేశారు. వెంకటగిరిలో వున్న ఎస్‌పికెయం ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ హ్యాండ్‌లూమ్ టెక్నాలజీ కాలేజీలో బి.టెక్ కోర్సులను ప్రవేశపెట్టేలా తగు చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. ఈ సందర్భంగా వెంకటగిరి శాసన సభ్యులు కురుగొండ్ల రామకృష్ణ వెంకటగిరి నియోజకవర్గ పరిధిలోని చేనేత కార్మికుల నాయకులను మంత్రికి పరిచయం చేశారు.

ఈ సమావేశంలో శాసనమండలి సభ్యులు వాకాటి నారాయణరెడ్డి, చేనేత మరియు జౌళి శాఖ ఎ.డి బెన్వర్, చేనేత కార్మిక సంఘాల నాయకులు పాల్గొన్నారు.



# పోలీసులు కష్టపడ్డారు

## రొట్టెల పండుగ ఉత్సవాల్లో వారి సేవలు ప్రశంసనీయం



నెల్లూరుజిల్లాలో ఈ సంవత్సరం గతంలో ఎన్నడూ లేని విధంగా రొట్టెల పండుగ ఉత్సవాలు ఘనంగా జరిగాయి. చివరిరోజైన ఆదివారం కూడా భక్తుల రద్దీ కొనసాగింది. ఈ క్రమంలో నెల్లూరు జిల్లా పోలీసులు భక్తులకు భద్రత, బందోబస్తుతో పాటు అన్నదాన సేవలు అందించి ప్రజల మన్ననలు పొందారు. ఈ ఉత్సవాల ప్రారంభం ముందు నుంచి కూడా నెల్లూరుజిల్లా ఎస్పీ విశాల్‌గున్నీ పక్కా కార్యాచరణతో ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని జోడించి భద్రత, బందోబస్తు ప్రణాళికను రూపొందించారు. ఈ ప్రణాళికను సౌత్ కోస్టల్ జోన్ ఐజిపి యన్.సంజయ్ స్వయంగా సమీక్షించిన అనంతరం ఈ నెల 12 నుంచి 16వ తేదీ వరకు అమలు చేయడం జరిగింది. ఈ ఉత్సవాల్లో మొదటిసారిగా రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు, ప్రతిపక్ష నాయకుడు వై.యస్. జగన్‌లు పాల్గొనగా, లక్షలాది మంది భక్తులు దేశ, విదేశాల నుండి వచ్చినప్పటికీ ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఎంతో ప్రశాంతంగా జిల్లా పోలీసులు బందోబస్తు నిర్వహించి విజయవంతం చేశారు. ఈ ఉత్సవాల్లో మొట్టమొదటిసారిగా 24గంటలు డ్రోన్ కెమెరా, సి.సి.టి.వి నిఘాల గ్రౌండ్ ఫుటేజీని వివిధ స్థాయిల్లో ఉన్న కమాండ్ కంట్రోల్స్ సమీక్షిస్తూ నేరనియంత్రణతో పాటు సిబ్బందికి పలు సూచనలు ఇస్తూ ప్రసార వ్యవస్థను ప్రభావవంతంగా వినియోగించడం జరిగింది. ఈ ఉత్సవాల్లో జిల్లా పోలీసు అధికారులు, పోలీస్ సేవాదళ్ సిబ్బంది, బిడి టీమ్స్, డ్రోన్ టీమ్స్‌తో పాటు, గుంటూరు అర్బన్, రూరల్, ప్రకాశం జిల్లాల నుండి వచ్చిన ఫోర్సు, కృష్ణపట్నం సెక్యూరిటీ గార్డ్స్, ఎన్‌సిసి కేడెట్లు, ఇతర వాలంటీర్ల సేవలకు జిల్లా ఎస్పీ విశాల్ గున్నీ కృతజ్ఞతలు తెలిపారు.

# ఇక షోరూమ్‌లలోనే రిజిస్ట్రేషన్



ఆన్‌లైన్‌లోనే వాహనాల రిజిస్ట్రేషన్‌కు ఈ నెల 17వ తేదీన అంకురార్పణ చేసారు. ఆరోజు నెల్లూరులోని భార్గవి ఆటోమొబైల్స్ షోరూమ్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ రేవు ముత్యాలరాజు చేతుల మీదుగా ఈ ప్రక్రియను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సాంకేతిక పరిజ్ఞానం వినియోగించుకోవడంలో రవాణా శాఖ ఒక అడుగు ముందుకు వేసి ఇ-ప్రగతి విధానం ద్వారా ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్ ప్రారంభించడం అభినందనీయమన్నారు.

రవాణాశాఖ డిప్యూటీ ట్రాన్స్‌పోర్ట్ కమిషనర్ శివరామ ప్రసాద్ మాట్లాడుతూ భారత దేశంలో ఎక్కడాలేని విధంగా తొలి సారిగా ఆంధ్రప్రదేశ్‌లోని 13జిల్లాల్లో ఈరోజు నుండి కొత్త వాహనాల ఆన్‌లైన్ ప్రక్రియ మొదలైందని తెలిపారు. దీని ద్వారా వినియోగదారులకు ఆర్‌టిఓ ఆఫీసు చుట్టూ తిరిగే అవసరం లేకుండా రోజుల తరబడి వేచివుండే ఆవశ్యకత లేకుండా వాహనం కొనుగోలు చేసిన రోజునే సంబంధిత ఏజన్సీ వద్ద నుండి ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్ ద్వారా శాశ్వత నెంబరును పొంద వచ్చన్నారు.

ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్ ద్వారా ప్రధానంగా రవాణాశాఖలో చోటుచేసుకునే అవినీతికి అడ్డుకట్ట వేసినట్లవుతుంది. అలాగే వివిధ రూపాలలో రిజిస్ట్రేషన్ కంటే రెండింతలయ్యే ఏజంట్లు, ఇతరుల ఖర్చుకు తెరపడింది.

ఈ కార్యక్రమంలో ఆర్‌టిఓ పూర్ణ చంద్రరావు, ఎపిఎస్ఆర్‌టిసి రీజనల్ మేనేజర్ రవివర్మ, భార్గవి ఆటోమొబైల్స్ అధినేత కొండా బలరామరెడ్డి, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ కొండా నిరంజన్‌రెడ్డి, ఆంధ్రప్రదేశ్ మాజీ లారీ ఓనర్ల అసోసియేషన్ ప్రెసిడెంట్ గోపాలనాయుడు తదితరులు పాల్గొన్నారు.

అనంతరం తొలిసారి ఆన్ లైన్ ప్రక్రియ ద్వారా రిజిస్ట్రేషన్ పొందిన కె.వెంకటేశ్వర్లుకు శాశ్వత నెంబరుగా ఎ.పి.26 బిఎన్ 0002 నెంబరును కేటాయిస్తూ కారు తాళాలను అందజేశారు.

## డాక్టర్ భక్తవత్సలరెడ్డికి

# ఎక్సలెన్స్ అవార్డు



నెల్లూరు నగరంలోని సింహపురి ఆసుపత్రి గుండెవ్యాధుల వైద్యనిపుణులు డాక్టర్ చిర్రా భక్తవత్సలరెడ్డి మాజీ రాష్ట్రపతి ఏపిజె అబ్దుల్ కలాం ఎక్సలెన్స్ అవార్డును అందుకున్నారు. న్యూఢిల్లీలో జరిగిన అబ్దుల్‌కలాం జయంతి సభలో మాజీ లోక్‌సభ స్పీకర్ శివరాజ్‌పాటిల్, మాజీగవర్నర్ భీష్మనారాయణసింగ్, ఏఐసిసి కార్యదర్శి వేదప్రకాష్‌లు ఈ అవార్డును ప్రదానం చేశారు. సోమవారం సింహపురి ఆసుపత్రి ఎండి కాటంరెడ్డి రవీంద్రరెడ్డి ఆయన్ను అభినందించి మాట్లాడుతూ దేశంలో నలుగురు వైద్యులకు అబ్దుల్‌కలాం ఎక్సలెన్స్ అవార్డును ప్రదానం చేశారన్నారు. అందులో తమ ఆసుపత్రి వైద్యులు భక్తవత్సలరెడ్డికి అవార్డు దక్కడం అభినందనీయమన్నారు. డాక్టర్ భక్తవత్సలరెడ్డి మాట్లాడుతూ అబ్దుల్‌కలాం అడుగుజాడల్లో నడుస్తూ ప్రజలకు మరిన్ని సేవలు అందిస్తానన్నారు. ఆసుపత్రి వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు.




పోలీసు అమరవీరుల సంస్మరణ దినం

అక్టోబర్ 21

త్యాగాలకు ప్రతీకలుగా నిలిచి... ప్రజా రక్షణకు కంకణబద్ధులై

అనుక్షణం మా కోసం తపించిన అమర పోలీసులకు

ఇదే మా అశ్రునివాళి.



యస్.రాఘవరావు

డి.యస్.పి., కావలి



టి.అశోక్‌వర్ధన్

సి.ఐ., కావలి



జి.పుల్లారావు

ఎస్.ఐ., కావలి



ఎ.సుబ్బారావు

ఎస్.ఐ., కావలి



సురె జయశ్రీ

ఎంపిటిసి, గౌరవరం



యస్. శ్రీనివాసులరెడ్డి

జిల్లా తెలుగు యువత ఆర్గనైజింగ్ సెక్రటరీ




చేవూరు అలేఖ్య

సర్పంచ్, గౌరవరం పంచాయితీ

# కళ్యాణ వైభవం...!



బెంగుళూరు వాస్తవ్యులు కాటంరెడ్డి శివకుమార్‌రెడ్డి - శరణ్యల కుమార్తె (ఇనమడుగు వాస్తవ్యులు కాటంరెడ్డి వెంకటరామిరెడ్డి మనుమరాలు) **సంజన - రిత్విక్** (ప్రముఖ న్యాయవాది కీ॥శే॥ గునపాటి ఆదిశేషారెడ్డి మనుమడు, గునపాటి శ్రీనివాసులురెడ్డి - సింధుల కుమారుడు)ల వివాహం ఈ నెల 13వ తేదీ నెల్లూరులోని విపిఆర్ కన్వెన్షన్ సెంటర్ నందు జరిగింది. కొత్త జంటకు 'లాయర్' శుభదీవెనెలు.



మాజీ శాసనసభ్యులు కాటంరెడ్డి విష్ణువర్ధన్‌రెడ్డి - శివప్రియల కుమారుడు **విక్రమ్ ఆదిత్య - డా॥ శ్రీలక్ష్మి** (కీ॥శే॥ పి.ధర్మయ్య - విమలల కుమార్తె)ల కల్యాణం ఈ నెల 15వ తేదీ హైదరాబాద్‌లోని జె.ఆర్.సి. కన్వెన్షన్ సెంటర్ నందు జరిగింది. వైకాపా అధ్యక్షులు వై.యస్.జగన్మోహన్‌రెడ్డి, రాజ్యసభ సభ్యులు వి.విజయసాయిరెడ్డి, ఇంకా నెల్లూరుకు చెందిన వైకాపా నాయకులు, ప్రముఖులు వివాహ వేడుకలకు హాజరై వధూవరులను ఆశీర్వదించారు. నూతన దంపతులకు 'లాయర్' శుభాకాంక్షలు.



నెల్లూరు వాస్తవ్యులు కోలగట్ల వెంకటరమణారెడ్డి - శోభారాణిల కుమార్తె **కావ్య - వరుణ్‌రెడ్డి** (విడవలూరు మండలం ఊటుకూరు వాస్తవ్యులు బెజవాడ కళాధర్‌రెడ్డి - విజయభారతిల కుమారుడు)ల పరిణయం ఈ నెల 15వ తేదీ నెల్లూరులోని సిపిఆర్ కళ్యాణ మండపం నందు జరిగింది. వధూవరులకు 'లాయర్' శుభాశీస్సులు.



శ్రీ గాయత్రి విద్యాసంస్థల జోనల్ డైరెక్టర్ తుమ్మల నరసయ్యనాయుడు - చాముండేశ్వరిల కుమారుడు **పార్థివ్ - అనూష** (నెల్లూరు వాస్తవ్యులు డా॥ తాళ్కూరు రమణయ్యనాయుడు - సుజాతల కుమార్తె)ల పెళ్ళి ఈ నెల 13వ తేదీ నెల్లూరులోని కస్తూరిదేవి గార్డెన్స్ నందు జరిగింది. కొత్త దంపతులకు 'లాయర్' శుభాభినందనలు.

# మున్సిపాలిటీలో నారాయణ ఆకస్మిక తనిఖీ



డంపింగ్ యార్డ్‌ను పరిశీలిస్తున్న మంత్రి నారాయణ

## గూడూరు డివిజన్ వార్తలు

గూడూరు మున్సిపాలిటీలో పురపాలక శాఖామంత్రి నారాయణ ఆదివారం ఆకస్మికంగా తనిఖీలు నిర్వహించారు. పురపాలక, రెవెన్యూ అధికారులు పరుగులు తీశారు. ఎక్కడికి వెళ్తున్నారు, ఏం చూస్తున్నారన్న విషయం తెలియకపోవడంతో మంత్రి వెంట అందరూ పరుగులు తీశారు. విజయవాడ నుంచి వచ్చిన ఆయన రాపూరులో జరిగే బీసీల సదస్సుకు వెళ్లేందుకు గూడూరుకు చేరుకున్నారు. గూడూరు రైల్వేస్టేషన్‌కు చేరుకున్న మంత్రికి గూడూరు ఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్, పురపాలక ఛైర్‌పర్సన్ పొనకా దేవసేన, తెలుగుదేశం నాయకులు ఘనంగా స్వాగతం పలికారు. అనంతరం అక్కడ నుంచి నేరుగా గూడూరు పట్టణ శివారు ప్రాంతంలో ఉన్న డంపింగ్‌యార్డ్‌ను పురపాలక సంఘ అధికారులు, కౌన్సిలర్లతో కలసి విస్తృతంగా పరిశీలించారు. అక్కడ నుంచి నేరుగా పట్టణ సమీపంలోని గాంధీనగర్‌లోని కొత్త ఇందిరమ్మ లే అవుట్‌లో ఉన్న నివాస గృహాలను, ఎన్టీఆర్ గృహకల్పన కింద మంజూరైన ఇళ్ళ నిర్మాణాల కోసం నివేశ స్థలాలను పరిశీలించారు. అక్కడ స్థానికులు తమ సమస్యలు మంత్రికి తెలియజేశారు. గూడూరు పురపాలక సంఘానికి ప్రత్యేకంగా నిధులు మంజూరుకు కృషి చేసి, సుందరంగా తీర్చిదిద్దుతానని చెప్పారు. ఈ కార్యక్రమంలో వైస్‌ఛైర్మెన్ శీలం కిరణ్‌కుమార్, ఆర్డీవో ఇన్‌ఛార్జి వెంకటసుబ్బయ్య, కౌన్సిలర్లు పాల్గొన్నారు.

# ఆదిశంకరలో బీసీ అవగాహన సదస్సు



గోడపత్రికను ఆవిష్కరిస్తున్న మంత్రి కొల్లు రవీంద్ర, ఎమ్మెల్యేలు తదితరులు

గూడూరు పట్టణంలోని ఆదిశంకర కళాశాలలో సోమవారం బీసీ విద్యార్థుల ఉపకార వేతనాల అవగాహన సదస్సును నిర్వహించారు. తొలుత ఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్ ఆధ్వర్యంలో రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ, చేనేత ఎక్సైజ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్రకి ఘనంగా పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. ఈ సందర్భంగా మంత్రి రవీంద్ర మాట్లాడుతూ బలహీనవర్గాలలో ఆత్మవిశ్వాసాన్ని నింపి వారి జీవితాల్లో వెలుగులు నింపిన మహోన్నత వ్యక్తి తెలుగుదేశం పార్టీ వ్యవస్థాపకులు ఎన్టీఆర్ అని, అప్పటి నుంచి నేటి వరకు బీసీల అభ్యున్నతికి తెలుగుదేశం పార్టీ కృషి చేస్తోందన్నారు. ఆర్థికంగా, సామాజికంగా రిజర్వేషన్లు కల్పించి అనేక సంక్షేమ కార్యక్రమాలు చేపట్టిందన్నారు. బీసీ రెసిడెన్షియల్ స్కూళ్ళ ఏర్పాటు, పూరి ఇల్లు ఉన్న స్థానంలో పక్కా ఇళ్ల నిర్మాణం తెలుగుదేశంపార్టీతోనే సాధ్యపడిందన్నారు. రాష్ట్రంలోని 7.50లక్షల మంది బీసీ, 2.5లక్షల మంది ఈ బీసీ విద్యార్థులకు ఉపకారవేతనాలు ఫీజు రియంబర్స్‌మెంట్ క్రింద రూ.1600కోట్లు చెల్లిస్తూ విద్యార్థుల ఉన్నతస్థాయికి చేరేందుకు కృషి చేస్తోందన్నారు. అనంతరం ఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్, కురుగొండ్ల రామకృష్ణ, ఎమ్మెల్సీలు బీద రవిచంద్ర, నారాయణరెడ్డి మాట్లాడుతూ బీసీ విద్యార్థులు ప్రభుత్వం చేస్తున్న సంక్షేమ కార్యక్రమాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ ఛైర్‌పర్సన్ పొనకా దేవసేన, కళాశాల ఛైర్మెన్ వంకి పెంచలయ్య, టిఎన్ఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు తిరుమల నాయుడు, తెలుగుదేశం గూడూరు నియోజకవర్గ నాయకులు బొల్లినేని కోటేశ్వరరావు, నాయకులు వెంటేశ్వర్లురెడ్డి, పులిమి శ్రీనివాసులు, మధురెడ్డి, కోటారెడ్డి, జడ్పీటీసీ సభ్యులు పద్మ, భారతి, ఎంపిపిలు, ఎంపిటిసిలు, సర్పంచ్‌లు, బీసీ సంఘాల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# వాల్మీకి జయంతి వేడుకలు



మాట్లాడుతున్న విహెచ్‌పి ప్రతినిధి వ్యాసరాజు, ప్రక్కన మురళిరెడ్డి

గూడూరు పట్టణంలోని స్థానిక కేశవ నిలయంలో విహెచ్‌పి నాయకులు ఆదివారం వాల్మీకి జయంతి వేడుకలను నిర్వహించారు. తొలుత వాల్మీకి చిత్రపటానికి పూలమాల వేసి స్మరించుకున్నారు. ఈ సందర్భంగా విహెచ్‌పి ప్రతినిధి వ్యాసరాజు మాట్లాడుతూ హిందూ ధర్మాలను ప్రతిఒక్కరు పాటించేలా కృషి చేయాలని అన్నారు. సంస్కృతి సంప్రదాయాలను కాపాడుకోవాలని అన్నారు. రామరాజ్యం స్థాపనకు అందరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఆ సంఘ నాయకులు మల్లెమాల మురళీరెడ్డి, పుల్లయ్య, మురళీనాయుడు, నవీన్ జయకుమార్, ఆర్వీరావు తదితరులు పాల్గొన్నారు.



ఈ నెల 18వ తేదీ గూడూరు మండలంలోని ఆదర్శగ్రామం పి.ఆర్.కండ్రిగ అభివృద్ధిపై అధికారులతో సమీక్షిస్తున్న జిల్లా కలెక్టర్ ఆర్.ముత్యాలరాజు, పక్కన జాయింట్ కలెక్టర్ ఎ.ఎం.డి.ఇంతియాజ్

## మేషం



అశ్వని, భరణి, కృతిక 1 పాదము

శుభకార్య ప్రయత్నాలు నెరవేరే అవకాశం కలదు. దైవకార్యాలలో పాల్గొంటారు. తొందరపడి హామీలివ్వడం, చెల్లింపులు జరుపవద్దు. విద్యార్థులు బాగా కష్టపడి చదవవలెను. పెట్టుబడులు వ్యాపార విస్తరణకు అవకాశాలుంటాయి. ఇంటి ఖర్చులు పెరుగుతాయి. శుభవార్తలు వింటారు. ఖర్చులకు తగిన ఆదాయం ఉంటుంది. వృత్తి వ్యాపారాలు సామాన్యంగా జరుగుతాయి.

## వృషభం



కృతిక 2, 3, 4 పాదాలు, రోహిణి, మృగశీర్ష1, 2పాదాలు

దూరప్రయాణాలు చేయవలసి రావచ్చును. ఆర్థిక, సామాజిక వ్యవహారాలను జాగ్రత్తగా నిర్వహించండి. స్థిరాస్తుల వ్యవహారాలను వాయిదా వేసికొనడం మంచిది. ఉద్యోగులకు సామర్థ్య కారణంగా గుర్తింపు గౌరవాలు బాగుంటాయి. విద్యార్థులకు మంచి విద్యాప్రగతి కలదు. విలువైన వస్తువులను కొనుగోలు చేస్తారు. ఆదాయ వ్యయాలు సంతృప్తికరంగా ఉంటాయి.

## మిధునం



మృగశీర్ష 3,4 పాదాలు, ఆర్ధ్ర, పునర్వసు 1, 2, 3పాదాలు

దైవ సేవా కార్యాలలో పాల్గొంటారు. బిల్లుల చెల్లింపులు సకాలంలో చేస్తారు. యజమానులకు వర్కర్లతో ఇబ్బందులుంటాయి. కళాక్రీడా ఉపాధి రంగాల వారికి అవకాశాలు బాగుంటాయి. దూరప్రయాణాలు అవసరం ఉంటుంది. విమర్శలు, అభియోగాలున్నా పట్టించుకొనవద్దు. ఉద్యోగులకు విధి నిర్వహణ సాఫీగా సాగుతుంది. ఆరోగ్యం స్వల్పంగా ఇబ్బంది పెడుతుంది.

## కర్కాటకం



పునర్వసు 4 పాదం, పుష్య, ఆశ్లేష

ఉద్యోగులకు స్థాన మార్పులు, కొత్త బాధ్యతలుంటాయి. తొందరపడి నమ్మకం పెంచుకొని ధన సహాయం చేయవద్దు. అనుకోని ప్రయాణాలుంటాయి. కళాక్రీడా శాస్త్ర సాంకేతిక రంగాల వారికి ప్రోత్సాహకరంగా ఉంటుంది. శుభకార్య ప్రయత్నాలు నెరవేరవచ్చును. ఆరోగ్యం బాగుంటుంది. ఆర్థిక పరిస్థితి బాగున్నా ఆదాయం సామాన్యంగా ఉంటుంది.

## సింహం



మఖ, పుబ్బ, ఉత్తర 1పాదము

శుభకార్య ప్రయత్నాలు నిర్ణయం కాగలవు. చర్చలు సమావేశాలకై దూరప్రయాణాలుంటాయి. ఉద్యోగుల శ్రమకు గుర్తింపు గౌరవాలుంటాయి. నిరుద్యోగులకు ఉద్యోగావకాశాలు, వ్యాపారవర్గాలకు పెట్టుబడి అవకాశాలుంటాయి. ఆరోగ్యం, కుటుంబ సౌఖ్యం బాగుంటుంది. వృత్తి వ్యాపారాలలో అభివృద్ధి బాగుంటుంది. ఆదాయం పెరుగుతుంది. కొత్త వస్తువులు పరికరాలు కొంటారు.

## కన్య



ఉత్తర 2, 3, 4 పాదాలు, హస్త, చిత్త 1, 2 పాదాలు

దైవ కార్యాలలో పాల్గొంటారు. సమావేశాలకు ఆహ్వానాలు అందుతాయి. కొన్ని అదనపు ఖర్చులుండును. ఇబ్బంది రాదు. ఉద్యోగవర్గాలకు పనులు అదనంగా ఉంటాయి. స్థిరాస్తుల క్రయవిక్రయాలకు అవకాశాలు లభించగలవు. బంధుమిత్రుల రాకపోకలుంటాయి. విలువైన వస్తువులు కొనడం, మంచి ఆరోగ్యముంటుంది. కోర్టు వ్యవహారాలు వాయిదా పడతాయి.



### బ్రహ్మశ్రీ స్వయంపాకుల శ్రీనివాసులు

బాలాజీనగర్, నెల్లూరు

# రాశి - మీ వాసి

తేది. 21.10.2016 నుండి
తేది. 27.10.2016 వరకు

ఈ వారము మిధున కర్కాటక సింహ కన్యా రాశులలో చంద్రుడు, సింహంలో రాహువు, కన్యలో గురువు, తులలో రవిబుధులు, వృశ్చికంలో శనిశుక్రులు, ధనుస్సులో కుజుడు, కుంభంలో కేతువు సంచరిస్తారు.

### పంచాంగము:

**ముహూర్తము:**

తేది 22 శనివారము ఉదయం గంట 4.29లకు కన్యా లగ్నమున గృహారంభము, వివాహము.

### ఆశ్వయుజ మాస కృష్ణపక్ష తిధులు

| | | | |
|---|---|---|---|
| తేది. 21 | శుక్ర | షష్ఠి | రా॥ గం.8.35వ॥ |
| తేది. 22 | శని | సప్తమి | రా॥ గం.6.52వ॥ |
| తేది. 23 | ఆది | అష్టమి | సా॥ గం.5.34వ॥ |
| తేది. 24 | సోమ | నవమి | సా॥ గం.4.37వ॥ |
| తేది. 25 | మంగళ | దశమి | సా॥ గం.4.12వ॥ |
| తేది. 26 | బుధ | ఏకాదశి | సా॥ గం.4.19వ॥ |
| తేది. 27 | గురు | ద్వాదశి | సా॥ గం.4.51వ॥ |

## తుల



చిత్త 3, 4 పాదాలు, స్వాతి, విశాఖ 1, 2, 3 పాదాలు

ప్రభుత్వ అనుమతులకు ఆలస్యం జరగవచ్చును. ఉద్యోగులకు, వ్యాపార వర్గాలకు ప్రభుత్వ పరంగా ఇబ్బందులు, దాడులుంటాయి. శుభకార్య ప్రయత్నాలు అనుకూలం. కుటుంబంలో చిన్న విషయంపై విభేదాలు రావచ్చును. విద్యావృద్ధికి గట్టి కృషి అవసరం. అవసరాలకు, చెల్లింపులకు కొద్ది ఋణం చేయడం గాని, వాయిదాలు వేసికొనడం గాని జరుగుతుంది.

## వృశ్చికం



విశాఖ 4 పాదం, అనూరాధ, జ్యేష్ఠ

వ్యవహారాల నిర్వహణలో తగిన నిర్ణయాలు చేయడం, అందరితో సత్సంబంధాలు ఏర్పరచుకొనడం పలుకుబడి, విలాసములకు ఖర్చులు పెట్టడం జరుగుతుంది. స్త్రీలకు ఆనారోగ్య బాధలుంటాయి. గృహ వాహన వస్తు రిపేర్లుంటాయి. విలువైన వస్తువులు పత్రాలను జాగ్రత్త పరచుకొనాలి. అనుకోని ప్రయాణాలుంటాయి. ఉద్యోగ ప్రయత్నాలలో అనుకూలత బాగుంటుంది.

## ధనుస్సు



మూల, పూర్వాషాఢ, ఉ.షాఢ 1 పాదము

ఉద్యోగులకు అధికారుల ఆదరణతో పాటు, కొత్త పనులు అప్పగించబడతాయి. కొత్త పెట్టుబడులకు అవకాశాలు దొరుకుతాయి. విలువైన వస్తువులు యంత్ర పరికరాలు కొంటారు. పెండింగ్ సమస్యలు పరిష్కారానికి వస్తాయి. యజమానులకు వర్కర్లతో ఇబ్బందులుంటాయి. ఆరోగ్య విషయంలో జాగ్రత్త అవసరం. అనుకున్న పనులను పట్టుదలతో చేస్తారు.

## మకరం



ఉ.షాఢ 2, 3, 4 పాదాలు, శ్రవణ, ధనిష్ఠ 1, 2 పాదాలు

శ్రమతో అనుకున్న పనులను జరుపుకొంటారు. కొందరి విమర్శలుంటాయి. పట్టించుకొనవద్దు. దూర ప్రయాణాలుంటాయి. ఆరోగ్య విషయంలో జాగ్రత్త పాటించండి. బిడ్డల ఉద్యోగ, శుభకార్య నిర్ణయాలు జరుగుతాయి. అధికారులకు పనిభారం స్థానమార్పుంటుంది. విద్యాప్రగతి బాగుంటుంది. స్థిరాస్తుల లావాదేవీలు వాయిదా పడతాయి.

## కుంభం



ధనిష్ఠ 3, 4 పాదాలు, శతభిష, పూ.భాద్ర 1,2,3 పాదాలు.

సొంత పనులు నిదానంగా సాగుతాయి. బంధువర్గం వారికి అనారోగ్య బాధలు ఇబ్బందులుంటాయి. ప్రభుత్వ అనుమతులు ఆలస్యం కాగలవు. అందుచే టెన్షన్‌గా ఉంటుంది. కుటుంబంలో అనుకూలత తక్కువ. ఖర్చులు అదనంగా పెరుగుతాయి. ఆర్థికాభివృద్ధికై ప్రయత్నాలు నిరుత్సాహాన్ని కలిగిస్తాయి. వృత్తి పరంగా ఆదాయం తృప్తికరం. వ్యాపారవృద్ధి అవకాశాలు చేజారి సామాన్య ఆదాయముంటుంది.

## మీనం



పూర్వాభాద్ర 4 పాదం, ఉ.భాద్ర, రేవతి

ఇంటికి కొత్త విలువైన వస్తువులు పరికరాలు కొంటారు. బాకీల చెల్లింపులు సకాలంలో జరుగుతాయి. శుభకార్య ప్రయత్నాలలో అనుకూలత, ఉద్యోగార్థులకు అవకాశాలు లభించడం, విద్యార్థులకు మంచి ప్రగతి ఉంటుంది. ముఖ్య వస్తువులు, పత్రాలు జాగ్రత్త పరచుకొనండి. భార్యాబిడ్డలకు, ముఖ్యంగా స్త్రీలకు అనారోగ్య బాధలుంటాయి. వస్తు వాహన రిపేర్ల ఖర్చులుంటాయి.

# నెల్లూరు దోమల దెబ్బకు తోకముడిచిన బాబు బెటాలియన్

శ్రీను గల్పిక

### బాబు బెటాలియన్ సర్జికల్ స్ట్రైక్స్ - 3

***జరిగిన కథ:*** ***హైటెక్ రత్న చంద్రబాబు తన మంత్రుల బృందంతో కలిసి దోమలపై సర్జికల్ స్ట్రైక్స్‌కు బయలుదేరుతాడు. మొదట శ్రీకాకుళం జిల్లాలో సర్జికల్ స్ట్రైక్స్ నిర్వహించి దోమల గుంపులను సామూహికంగా మట్టుబెడతారు. ఆ తర్వాత విజయనగరం, విశాఖపట్నం, ఉభయ గోదావరి జిల్లాల మీదుగా కృష్ణా జిల్లా వరకు చంద్రబాబు బెటాలియన్ దోమలపై సర్జికల్ స్ట్రైక్స్‌ను విజయవంతంగా నిర్వహిస్తుంది. బాబు రూపంలో తమ పాలిట మృత్యువు ముంచుకొస్తుందని తెలిసి రాష్ట్రంలోని ఇతర జిల్లాల దోమలన్నీ నెల్లూరు దోమల రారాజు డెంగ్యూకింగ్ కాలకేయను ఆశ్రయిస్తాయి. గుంటూరు, ప్రకాశం జిల్లాల్లో దోమలేవీ కనిపించకపోవడంతో చంద్రబాబు బెటాలియన్ నెల్లూరుకు చేరుకుంటుంది. నెల్లూరులో దోమలపై సర్జికల్ స్ట్రైక్స్‌కు చంద్రబాబు బెటాలియన్ కదలబోతుండగా... అక్కడే వున్న ఆనం రామనారాయణరెడ్డి ఆవేశంతో... చంద్రబాబు కంటే విషయం తెలియదు... మరి నీ తెలివేమైందంటూ మంత్రి నారాయణను ప్రశ్నిస్తాడు. ఆ ప్రశ్నతో అందరూ ఉలిక్కిపడతారు.***

*ఆ తర్వాత...*

ఎందుకు నారాయణను అంత మాటన్నావు రామనారాయణ అని చంద్రబాబు అడిగాడు. మరి అడక్క ఏం చేసేదన్నా... నెల్లూరు ముదురుదోమల గురించి ఆయనకు తెలియదా? మీరు పది కాలాల పాటూ ఆరోగ్యంగా ఉంటేనే కదా మేము, ఈ రాష్ట్రం పచ్చగా ఉండేది. ఇప్పుడు నెల్లూరు ముదురు దోమల జోలికి వెళ్లి, వాటిచేత కరిపించుకుని ఆసుపత్రి పాలుకావడం మనకు అవసరమా? నెల్లూరు దోమలతో పెట్టుకుంటే నిప్పుతో నేషనల్ గేమ్స్ ఆడినట్లే అని రామనారాయణ అన్నాడు. అందుకు చంద్రబాబు... నేను మైండ్‌లో ఒక్కసారి ఫిక్స్ అయ్యానంటే బ్లైండ్‌గా వెళ్లిపోతాను, ఇప్పటిదాకా దోమలను చూసి మీరు భయపడ్డారు. కాని ఇక నుండి అవి నన్ను చూస్తే ఉచ్చపోస్తాయి. ఈ చంద్రబాబంటే ఏంటో వాటికి చూపిస్తాను "పదండి ముందుకు పదండి తోసుకు పోదాం మన్సూర్ నగర్‌కు" అంటూ నినాదాలు చేసాడు. నాయకులు, కార్యకర్తలందరు కూడా జయహో చంద్రబాబు అంటూ ఫాగింగ్ మిషన్‌లను గాల్లోకి లేపి నినాదాలు చేస్తూ ముందుకు కదిలారు.

అది మన్సూర్‌నగర్‌లో ప్రధాన దోమల ఉత్పత్తి కేంద్రం, చంద్రబాబు బెటాలియన్ తమపై దాడికి వస్తుందని తెలిసి నెల్లూరు కార్పొరేషన్ ముదురుదోమలన్నీ కూడా ఒక సమూహంగా రోడ్డుపైకి వచ్చాయి. వాటి నాయకుడు డెంగ్యూ కింగ్ కాలకేయ వాటికి ముందు భాగాన నిలిచి యుద్ధానికి నేతృత్వం వహిస్తున్నాడు. అప్పుడే చంద్రబాబు బెటాలియన్ అక్కడకు చేరుకుంది. అక్కడ క్షణాల్లో యుద్ధ వాతావరణం నెలకొంది. చంద్రబాబు, కాలకేయుడుల మధ్య వాదనలు మొదలయ్యాయి.

**చంద్రబాబు :** కాలకేయ, నీకు ప్రాణభిక్ష పెడతాను, వెంటనే ఈ ఊరును, ఈ రాష్ట్రాన్ని విడిచి వెళ్లిపో!

**కాలకేయ :** *నా కిల్లా పకాలే జుయ్, డాంగీ టమకే జమూర్ సాకేర్ టప్పా!*

చంద్రబాబు పక్కనే వున్న మేయర్ అజీజ్‌తో... వాడు మనకు రాని భాషలో మనల్ని పచ్చి బూతులు తిడుతున్నట్లున్నాడు. ఇంతకీ వాడేం మాట్లాడుతున్నాడు. వాడి భాషేంటని అడిగాడు. దానికి అజీజ్... సార్, దానిని జిల్‌జిల్ భాషంటారు. ఈ నెల్లూరులో ఆ భాష తెలిసిన ఏకైక మొనగాడు మన ఆనం వివేకానందరెడ్డి. ఎందుకంటే 30ఏళ్లుగా ఆయన వాటితో కాపురం చేస్తున్నాడు. కాబట్టి వాటి మనసు, భాష తెలిసిన మనిషి ఆయనొక్కడేనని అన్నాడు. అప్పుడు నెల్లూరు దోమల సంగతి తెలిసి గుంపులో వెనుక నిలబడి వున్న వివేకాను ముందుకు పిలిపించాడు చంద్రబాబు. అక్కడే వివేకా గెటప్ చూసి ఆయన ఆశ్చర్యపోతూ... ఇదేంటి రోబో సినిమాలో రోబో రజనీ గెటప్‌లో వచ్చావు. దోమలపై సర్జికల్ స్ట్రైక్స్‌కు ఇదేమన్నా డ్రెస్ కోడా అని అడిగాడు. అందుకు వివేకా... అదేం లేదు సార్, ఈ గెటప్‌లో వుంటే దోమలు నా జోలికి రావని అని అన్నాడు. చంద్రబాబు వుండి... ముందు వాడేదో మాట్లాడుతున్నాడు. అది నాకర్థం అయ్యేటట్టు చెప్పు అని అన్నాడు. అప్పుడు వివేకా... మీరు వాడికి ప్రాణభిక్ష పెడతాను, వూరొదిలి పొమ్మన్నారు... కాని వాడు మిమ్మల్ని గంట లోపు ఇక్కడ నుండి వెళ్లకపోతే గంట తర్వాత పెద్దాసుపత్రిలో ఉంటావని హెచ్చరిస్తున్నాడని చెప్పాడు.

**చంద్రబాబు :** సింహంతో వేట, ఈ చంద్రబాబుతో ఆట వద్దు... ప్రపంచ దేశాలకే పాఠాలు చెప్పినవాణ్ణి... నా ముందా మీ ఆటలు, మర్యాదగా ఈ ఊరిని ఖాళీచేసి వెళ్లిపోండి!

**కాలకేయ :** *జింగిలే జంగిరే లప్పా... జార్‌కరో బింగిలి కరే సోచ్ మజుబస్సు బకా టిక్‌టిక్*

**ట్రాన్స్‌లేటర్ వివేకా :** నీకు అంత ముచ్చటగా ఉందనుకో... మాతో ఫోటో దిగి ఫ్రేమ్ కట్టించుకుని ఇంట్లో పెట్టుకో, అంతేగాని మాతో పెట్టుకోవద్దు. గన్‌ను చూడాలనుకోండి, తప్పులేదు, బుల్లెట్‌ను చూడాలనుకోవద్దు... ప్రాణాలకే ముప్పు!

**చంద్రబాబు :** చూడు... ఒక వైపే చూడు, రెండోవైపు చూడాలనుకోకు, తట్టుకోలేవ్, మాడి మసైపోతావ్!

**కాలకేయ :** *బల్‌కల్ బదలీ దేఖ్... బోరిగే మంత్ పఖలా దిస్‌బూత్ కరేతా లిక్‌లిక్*

**ట్రాన్స్‌లేటర్ వివేకా :** నీ ఫ్లూటు జింక ముందు ఊదు... సింహం ముందు కాదు, ఇలాంటి ఉడత బెదిరింపులకు భయపడడానికి నేనేమన్నా నీ క్రింద వుండే గల్లీలీడర్‌ను అనుకున్నావా... కాటర్‌ని... కాటు పడిందంటే నీ రూటు పెద్దాసుపత్రికే!

**చంద్రబాబు :** నేను కళ్లెర్ర చేస్తే ప్రపంచ దేశాలే వణికిపోతాయి. బిల్‌గేట్స్‌కు కంప్యూటర్ నేర్పించిన వాణ్ణి, సత్య నాదెళ్లకు ఉద్యోగమిప్పించిన వాణ్ణి, పి.వి.సింధుకు బ్యాడ్మింటన్ నేర్పించినవాణ్ణి... నా ముందు నువ్వెంత ఆఫ్ట్రాల్... నేను గట్టిగా తొడ కొట్టానంటే ఆ సౌండ్‌కే మీ దోమల జాతి అంతా మాడి బూడిదైపోతుంది.

**కాలకేయ :** *తకిటే తకిటే తకిటే... తంధానా జానీ వాకోర్ బోర్ బల్‌నా జిల్ జిల్*

**ట్రాన్స్‌లేటర్ వివేకా :** ఆపు ఆపు ఆపు... నీ గొప్పలు వినడానికి నేనేమన్నా ఆంధ్రా జనం లాంటి అమాయకుడిననుకున్నావా... నలుగురు మనుషులను వెంటేసుకుని, నాలుగు పొగ గొట్టాలు చేతుల్లో పట్టుకొచ్చి మమల్నే భయపించాలని చూస్తావా... భయం ఎలా వుంటుందో నీకు తెలిసేలా చేస్తాను... పగలు నిద్రపోలేవు, రాత్రి నిద్ర పోవాలన్నా రాదు, పోయి పోయి నెల్లూరు దోమలతో ఎందుకు పెట్టుకున్నానురా భగవంతుడా అని అనుక్షణం నువ్వు బాధపడేలా చేస్తాను. నీకు దమ్ముంటే మాటలాపి యుద్ధానికి రా... సై...

**చంద్రబాబు :** వీడి వినాశనాన్ని వీడే కొని తెచ్చుకుంటున్నాడు. ఇక మోగించండి యుద్ధ భేరీ... తీయండి ఫాగింగ్ మిషన్‌లు... వదలండి పొగను...

క్షణాల్లో యుద్ధం మొదలైంది. చంద్రబాబు సేన ఫాగింగ్‌మిషన్‌లకు పనిచెప్పింది. వాటిల్లోంచి పొగ దట్టంగా రాసాగింది. కాని ఎంత పొగ వదిలినా దోమలు చావడం లేదు, కాని ఆ పొగ దెబ్బకు చంద్రబాబు సైన్యంలో చాలామంది ఊపిరాడక పడిపోతున్నారు. చంద్రబాబు ఆశ్చర్యంగా వివేకాతో... ఇదేంటి, ఈ పొగ దెబ్బకు దోమలు చావడం లేదన్నాడు. అందుకు వివేకా... మీరు ఫాగింగ్ మిషన్‌లలో నెల్లూరు కార్పొరేషన్ వారు కొన్న కల్తీ మందులను వాడారు. అది పెద్దగా పని చేయదు. మా నెల్లూరు దోమల ధైర్యం కూడా అదే అని చెప్పాడు.

ఈలోపు డెంగ్యూ కాలకేయుడు... సత్ రేజూందా జుందా(అటాక్) అంటూ పిలుపునిచ్చాడు. ముదురుదోమల స్వైర విహారం మొదలైంది. అవి చంద్రబాబు సైనికులను పచ్చిపచ్చిగా కరవసాగాయి. ఆ కరుపుకు ఒళ్లంతా రక్తగాయాలతో పచ్చసైన్యం అల్లాడసాగింది. తీవ్ర గాయాలపాలైన వాళ్లను అంబులెన్స్‌లెక్కించి నగరంలోని అన్ని ఆసుపత్రులకు తరలించసాగారు. చివరకు యుద్ధ భూమిలో చంద్రబాబు, పక్కన వివేకా మాత్రమే మిగిలారు. వివేకా వుండి చంద్రబాబు చెవిలో... సార్, మనం ఇంకా ఇక్కడ వుంటే పరువుపోతుంది, కాలకేయుడితో నేను మాట్లాడి సైలెంట్ చేస్తాను. మీరు యుద్ధం మాని వెళ్లిపోండి... నెల్లూరు కొచ్చి దోమల చేతిలో చావుదెబ్బ తిన్నారన్న ప్రచారం రాకుండా ఉండేందుకు బారాషహీద్ దర్గా వద్దకెళ్లి రొట్టె పట్టండి, పుణ్యం పురుషార్థం కలిసొస్తుందని చెప్పాడు. చంద్రబాబు ఇక చేసేది లేక కాలకేయుడితో సంధి కుదుర్చుకుని దర్గావైపు బయల్దేరాడు. ***(అయిపోయింది)***



పోలీసు అమరవీరుల సంస్మరణ దినోత్సవం సందర్భంగా ఈ నెల 19వ తేదీన గూడూరులోని జి.యస్.రాయలు కళ్యాణ మండపంలో రక్తదాన శిబిరాన్ని నిర్వహిస్తున్న గూడూరు డిఎస్పీ బి.శ్రీనివాస్, టౌన్ సిఐ సుబ్బారావు

# ఈ కౌన్సిల్‌ను రద్దు చేయండి

## --- డిప్యూటిమేయర్, రూప్‌కుమార్‌ల వినతి ---



నగరపాలకసంస్థ పరిధిలోని ప్రజలు అనేక సమస్యలతో ఇబ్బందులు పడుతుంటే మేయర్ అబ్దుల్ అజీజ్ కౌన్సిల్ సమావేశాన్ని నిర్వహించక పోవడం బాధాకరమని, ఇలాంటి కౌన్సిల్‌ను రద్దు చేయాలని కమిషనర్ వెంకటేశ్వర్లును కోరుతూ డిప్యూటి మేయర్ ముక్కాల ద్వారకనాథ్, వైఎస్సార్సీపి ఫ్లోర్‌లీడర్ రూప్‌కుమార్ యాదవ్ వినతిపత్రం సమర్పించారు. కార్పొరేషన్ కార్యాలయంలో బుధవారం కమిషనర్‌కు రెండు అంశాలపై వారు వినతిపత్రం అందజేశారు. కౌన్సిల్ సమావేశం నిర్వహించి ఏడాది గడుస్తోందని, రాష్ట్రంలోని ఏ కార్పొరేషన్‌లో కూడా ఇలాంటి పరిస్థితి లేదని వారు విమర్శించారు. మంత్రి నారాయణ, కలెక్టర్, ఇతర అధికారుల సమక్షంలో ఈ నెల 19న కౌన్సిల్ సమావేశం నిర్వహిస్తామని చెప్పారని, అయితే మంత్రి ఇచ్చిన మాటను కూడా మేయర్ లెక్కచేయని స్థితి ఏర్పడిందని వారు పేర్కొన్నారు. రొట్టెల పండుగలో కోట్ల రూపాయలను స్వాహా చేశారని వారు ఈ సందర్భంగా ఆరోపించారు. ఘాట్లను నాసిరకంగా నిర్మించారని విమర్శించారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు లేబూరు పరమేశ్వరరెడ్డి, ఓబిలి రవిచంద్ర, గోగుల నాగరాజు, ఖలీల్‌అహ్మద్, నాయకులు వేలూరు మహేష్, వందవాసి రంగ తదితరులు పాల్గొన్నారు.

## కాలధర్మం

### మునమాల రామసుబ్బమ్మ



చెన్నైలోని అపోలో ఆసుపత్రిలో పేరెన్నికగన్న సీనియర్ కీళ్లు, ఎముకల వైద్య నిపుణులు, మన నెల్లూరీయుడు డాక్టర్ ఎం.మదన్‌మోహన్‌రెడ్డి మాతృమూర్తి మునమాల రామసుబ్బమ్మ ఈ నెల 15వ తేదీన చెన్నైలో అనారోగ్యంతో కనుమూశారు. ఆమె వయసు 79సంవత్సరాలు. ఆమెకు ఇద్దరు కుమారులు, ఒక కుమార్తె. పెద్దకుమారుడు దయాకర్‌రెడ్డి, కుమార్తె ప్రభావతమ్మ ఉపాధ్యాయ వృత్తిలో ఉండగా, రెండో కుమారుడు మదనమోహన్‌రెడ్డి మాత్రం నెల్లూరీయులు గర్వించే వైద్యుడిగా చెన్నై అపోలో ఆసుపత్రిలో సేవలందిస్తున్నారు. ఈ నెల 16వ తేదీన ఆమె అంత్యక్రియలు కలువాయి గ్రామంలో నిర్వహించారు. ఉత్తరక్రియలను ఈ నెల 27వ తేదీన కలువాయిలో నిర్వహిస్తారు.

రామసుబ్బమ్మ మృతికి సంతాపం తెలుపుతూ వారి కుటుంబసభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలుపుతోంది 'లాయర్'.

# జిఎస్‌టి ధగధగలు

**జిఎస్‌టిపై పరిశీలన-2**



చిన్ని శ్రావణ్‌కుమార్
చార్టర్డ్ అకౌంటెంట్

పన్ను కోసం రూపొందించే ప్రతి చట్టానికి ముందు మూడు ముఖ్యమైన అంశాలుంటాయి. అవి 1. పన్నువేయడానికి అధికారం 2. పన్ను ఎప్పుడు వేయాలి. 3. పన్ను ఎప్పుడు కట్టాల్సి వుంటుంది. ఇవి ముఖ్యంగా ఆ దేశ సామాజిక ఆర్థిక స్థితిగతులపై ఆధారపడివుంటాయి.

మన దేశంలో ఏ చట్టం చేయాలన్నా అది రాజ్యాంగం ఆధారంగానే చేయాల్సివుంటుంది. కానీ, వస్తు సేవాపన్ను చట్టం (జిఎస్‌టి)ని రూపొందించడానికి మనకు కొత్తతరహా విధానాలు కావలసిరావడంతో జిఎస్‌టి కార్యరూపం దాల్చడం కోసం 122వ భారత రాజ్యాంగ సవరణ జరిగింది.

ఆర్టికల్ 24 బి ఏ సవరణ ద్వారా కేంద్రానికి రాష్ట్రాలకు రెండింటికీ ఏకకాలంలో జిఎస్‌టి రూపొందించడానికి వెసులుబాటు కలిగింది. కేంద్రానికి ఇంటర్ స్టేట్ ట్రేడ్ కామర్స్ మీద విధించే ఐజిఎస్‌టికి మరియు జిఎస్‌టికి, రాష్ట్రానికి ఎస్‌జిఎస్‌టి ప్రవేశపెట్టడానికి వీలుకలిగింది. ఏ పన్ను ఎప్పుడు వేయాలి అనేదానిమీద పన్నుల చట్టాలు ఆధారపడివుంటాయి. ప్రస్తుతం మనకు వ్యాట్ అయితే గమ్యం మీద విధించే పన్నుగాను, ఎక్సైజ్ డ్యూటీ అయితే తయారీ మూలాల మీద పన్నుగాను, వస్తు సేవా పన్ను అయితే గమ్యాన్ని ఆధారం చేసుకుని వినియోగంపై వేసే పన్నుగాను చెప్పవచ్చు.

ఒకే రాష్ట్రంలో జరిగే లావాదేవీల మీద విధించే పన్నుని సెక్షన్7 (1) సిజిఎస్‌టి-ఎస్‌జిఎస్‌టి చట్టాల ద్వారా వర్తిస్తుంది. ఏఏ వస్తువులు మరియు సేవలపై రివర్స్ చార్జ్ వేయాలో సెక్షన్ 7 (3) ద్వారా పై చట్టాలు నిర్ణయిస్తాయి.

రివర్స్‌చార్జ్‌లో అమ్మే వ్యక్తి కాకుండా, కొనే వ్యక్తి పన్ను చెల్లించాలి. ఉదా : ఏ అనే వ్యక్తి బి అనే వ్యక్తితో 100 రూపాయలు విలువగల లావాదేవీ జరిపాడనుకుందాం. ఎస్‌జిఎస్‌టి, సిజిఎస్‌టి రెండూ కలిపి 8 శాతం అనుకుంటే, 8 రూపాయలు ఏ అనే వ్యక్తి వసూలు చేసి ప్రభుత్వానికి చెల్లిస్తాడు. రివర్స్‌చార్జిలో అయితే బి అనే వ్యక్తి ప్రభుత్వానికి చెల్లించాల్సి వుంటుంది. అదే ఐజిఎస్‌టిలో అయితే సెక్షన్ 4 (1) మరియు 4 (3) ద్వారా పన్ను విధించడం జరుగుతుంది.

సెక్షన్9 జిఎస్‌టి ప్రకారం ఎవరైనా ఇండియాలో వ్యాపారం చేసి మరియు షెడ్యూలు-3 ప్రకారం రిజిస్ట్రేషన్ చేయించుకునిఉంటే ఆ వ్యక్తియే పన్ను కట్టాల్సిన వ్యక్తిగా గుర్తించడం జరుగుతుంది. షెడ్యూలు-3 ప్రకారం ఏ వ్యక్తి అయినా వస్తు సేవా పన్నుల చట్టం అమలుచేసే రోజు, వ్యాట్ చట్టం ప్రకారం లైసెన్స్ కలిగివుంటే ఆ వ్యక్తి లేక సంస్థ కొత్త చట్టం ప్రకారం జిఎస్‌టి అమలు రోజునుంచి రిజిస్టర్ కావాల్సివుంటుంది.

ఒక వ్యక్తి కొత్తగా వ్యాపారం ప్రారంభిస్తే ఏ రోజు అయితే నిర్ణయించిన టర్నోవర్ దాటుతుందో ఆ రోజు నుంచి రిజిస్ట్రేషన్ తీసుకోవాల్సివుంటుంది.

జిఎస్‌టి ప్రకారం వ్యవసాయదారుడు ఎటువంటి పన్ను కట్టాల్సిన అవసరం లేదు.

షెడ్యూలు-4 లోని పనులు మరియు లావాదేవీలు కాకుండా క్రొత్తగా ఏ లావాదేవీలు జరిపినా వస్తు సేవా పన్నుల ప్రకారం పన్ను కట్టాల్సిన వ్యక్తిగా పరిగణిస్తారు.

సెక్షన్ 7 (2) ప్రకారం ప్రతి పన్ను కట్టవలసిన వ్యక్తి సిజిఎస్‌టి మరియు ఎస్‌జిఎస్‌టి కట్టవలసివుంటుంది.

ఐజిఎస్‌టి ప్రకారం పన్ను కట్టవలసిన వ్యక్తిని, సిజిఎస్‌టి పరిధిలో నిర్ధేశింపబడిన వ్యక్తిగా పరిగణిస్తారు.

షెడ్యూలు-3 జిఎస్‌టి చట్టం ప్రకారం వర్తకం విలువతో సంబంధం లేకుండా ఏ వ్యక్తి అయినా ఇతర రాష్ట్రాలతో వ్యాపార సంబంధాలు కలిగివుంటే జిఎస్‌టి రిజిస్ట్రేషన్ చేయాల్సి వుంటుంది. ఏ వ్యక్తి అయినా ఒకే రాష్ట్రంలో వ్యాపారం చేస్తూ నిర్ధిష్ట టర్నోవర్ లోపల వున్నచో అతడు కన్జంషన్ టాక్స్ పరిధిలోకి రావడానికి వీలు కల్పించబడినది. ఎవరయినా కాంపోజిషన్ కోరుకుంటే వారికి ఇన్‌పుట్ టాక్స్ వర్తించదు. కేవలం 1 శాతం రేటు మాత్రమే కాంపోజిషన్‌కు వర్తిస్తుంది.

మన జిఎస్‌టి కౌన్సిల్ సిఫార్సుకు అనుగుణంగా కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు కొన్ని వస్తు సేవలకి పన్ను కట్టడానికి వెసులుబాటు దొరుకుతుంది.

# పేదల సేవలో సత్యసాయి సేవాసమితి







నెల్లూరులోని భగవాన్ శ్రీ సత్యసాయి సేవా సమితి, భజన మందిరం ఆధ్వర్యంలో ఇటీవల కొత్తూరు అంబాపురంలోని గిరిజన కాలనీ యందు ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించి, పేదలకు వైద్యపరీక్షలు చేసి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. అలాగే గ్రామ సేవలో భాగంగా అక్కడ పారిశుద్ధ్య కార్యక్రమాలు నిర్వహించి సత్సంగం, సాయి నామస్మరణ చేసిన అనంతరం పేదలకు దుస్తుల పంపిణీ, అన్నదానం నిర్వహించారు. పాఠశాల విద్యార్థులకు దంత వైద్యపరీక్షలు, పెద్దలకు బి.పి, షుగర్ పరీక్షలు నిర్వహించారు.

ఈ కార్యక్రమంలో సత్యసాయి సేవా సమితి తరఫున కె.వెంకటేశ్వరరావు, నరసింహరావు, పందిళ్ళపల్లి పట్టాభిరామిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## గోరంత పదవికి కొండంత సంబరం

నెల్లూరుజిల్లా గ్రంథాలయ సంస్థ ఛైర్మెన్‌గా తెలుగుదేశం నాయకులు కిలారి వెంకటస్వామి నాయుడుకు గురువారం నెల్లూరులోని కస్తూరిదేవి గార్డెన్స్‌లో అభినందన సభ జరిగింది. కిలారి ప్రమాణ స్వీకారోత్సవానికి ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలను చూస్తుంటే సీఎంగా చంద్రబాబు ప్రమాణ స్వీకారం చేసేటప్పుడు కూడా ఇంత హంగామా లేదనిపించింది. నగరం నిండా కిలారి ఫోటోలతో ఫ్లెక్సీ కటౌట్‌లు వెలిసాయి. పేపర్ల నిండా ఆయన ప్రకటనలే! ఏ సందులో చూసినా ఆయన బ్యానర్లే! గ్రంథాలయ సంస్థ ఛైర్మెన్‌కే ఈ స్థాయిలో చేస్తే మరి ఎస్‌ఎఫ్‌సి ఛైర్మెన్, ఆర్టీసీ ఛైర్మెన్ వంటి పదవులిచ్చుంటే ఇంకే స్థాయిలో ఈ ఆర్భాటం ఉండేదో?








అమ్మా ....
అమ్మ కాని అమ్మా...
అమ్మ కాలేని అమ్మా
కన్నడ సీమలో పుట్టావమ్మా
తెలుగు తమిళ సీమల నేలావమ్మా..
అందాలతో హొయలొలికించావమ్మా
అందరినీ ఆకట్టుకున్నావమ్మా
ఎంజీఆర్‌తో చెలిమి చేశావమ్మా
రాజకీయ అరంగేట్రం చేశావమ్మా
జానకిని మరపించావమ్మా
పురచ్చి తలైవిగా నిలిచావమ్మా
చెప్పులు ఆస్తులు చరిత్రకెక్కిందమ్మా
ఏది చేసినా సంచలనమమ్మా
కరుణ కొండను ఢీ కొట్టావమ్మా
దుశ్శాసన పర్వంలో గెలిచావమ్మా
నాయకురాలిగా ఎదిగావమ్మా
ధైర్య సాహసాలు చూపావమ్మా
సబ్సిడీతో భోజనం పెడుతున్నావమ్మా
మంచినీళ్లను అందిస్తున్నావమ్మా
తెలుగును తొక్కేయాలనుకున్నావమ్మా
కోర్టు తీర్పుతో నిలుచుందమ్మా
ఎత్తుకు పై ఎత్తులలో దిట్టవమ్మా
ఎదురైన వారిని తొక్కేశావమ్మా
మహిళలకు మోటారు సైకిళ్ళు అన్నావమ్మా
అన్నీ ఇవ్వకనే మంచమెక్కావమ్మా
మద్రాసును వరదలు వదల్లేదమ్మా
అందరి అకౌంట్లలో నోట్లు వేయించావమ్మా
అనారోగ్యంతో ఆసుపత్రిలో ఉన్నావమ్మా
ఎందరెందరో చూసి పోతున్నారమ్మా
అధికారానికే పన్నీరు శెల్వమమ్మా
నీ నిజ వారసులెవరమ్మా
పోయస్‌గార్డెన్ బోసి పోయిందమ్మా
కావేరి నీళ్ళు చేరలేదమ్మా
దత్త పుత్రుడు ఎప్పుడో వచ్చాడమ్మా
కంటిచూపూ దొరకలేదమ్మా
ఆసుపత్రి ముందే అసలైన జనమమ్మా
నీ బిడ్డలు కానివారమ్మా
వీళ్ళే నీ అసలైన వారసులమ్మా
వారి కోసమన్నా రావమ్మా

**పి.యాసిన్**
'లాయర్' విలేకరి, శ్రీకాళహస్తి.
సెల్ : 9849817897

### జంబ్లింగ్ విధానంలోనే...

# ఇంటర్ ప్రయోగ పరీక్షలు

**- ఆర్ఐవో బాబు జాకబ్**



ఇంటర్ ప్రయోగ పరీక్షలు వచ్చే ఏడాది జంబ్లింగ్ విధానంలో జరుగనున్నాయని ఆర్ఐవో బాబు జాకబ్ తెలిపారు. మంగళ వారం నెల్లూరులోని తన కార్యాలయంలో విలేకర్లతో ఆయన మాట్లాడుతూ పరీక్షల్లో ఎలాంటి అక్రమాలు, అవకతవకలు జరగకుండా పక్కాగా నిర్వహించేందుకు కృషి చేస్తున్నామన్నారు. జిల్లాలో 174 జూనియర్ కళాశాలల్లో 161 సైన్సు కళాశాలలున్నాయని, వీటిలో 21,723 మంది సైన్సు విద్యార్థులు ఉండగా, వీరిలో 17,093మంది ఎంపిసి, 4630 మంది బైపిసి విద్యార్థులున్నట్లు వివరించారు. ప్రయోగ పరీక్షలకు జిల్లా వ్యాప్తంగా 51పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నామన్నారు. వీటిల్లో 36ప్రభుత్వ జూనియర్ కళాశాలలు, 15ప్రైవేటు కళాశాలల్లో ఏర్పాటు చేసామన్నారు. పరీక్షల నిర్వహణకు జిల్లాను 29జోన్లుగా విభజించినట్లు పేర్కొన్నారు. పరీక్షలకు సంబంధించి ఈ నెల 24వ తేదీ వరకు విద్యార్థులు ఫీజులు చెల్లించాలని, అపరాధ రుసుముతో 31వ తేదీ సాయంత్రం 5గంటల లోగా చెల్లించాలన్నారు. దివ్యాంగ విద్యార్థులు ఈ నెల 29వ తేదీలోపు సంబంధిత సర్టిఫికేట్లను ఇంటర్ బోర్డుకు అందజేయాలన్నారు.

ఈ ప్రయోగ పరీక్షలకు సంబంధించి పూర్తి వివరాలను www.rionellore.weebly.comలో ఉంచినట్లు తెలిపారు.

# 23న విద్యార్థులకు క్విజ్ పోటీలు

సోదరి నివేదిత జయంతి వేడుకల సందర్భంగా నెల్లూరు విఆర్‌సి సెంటర్‌లో వున్న రావూస్ జూనియర్, డిగ్రీ కాలేజీలో విద్యార్థులకు క్విజ్ పోటీలు నిర్వహిస్తామని శ్రీ రామకృష్ణ వివేకానంద భావ ప్రచార సమితి, శ్రీమతి కోకు అనసూయమ్మ సేవాసమితి నిర్వాహకులు ఉడతా శ్రీనివాసులు, తిప్పన జయకృష్ణ, పలగాటి సాయిచైతన్యరెడ్డి, కాకు మురళిరెడ్డి తెలియజేశారు.

23వ తేది ఉదయం 10 గంటలనుంచి ఈ కాలేజీలో పోటీలు ప్రారంభమవుతాయని, విద్యార్థుల్లో సత్శీలత, దేశభక్తి, దృఢ సంకల్పం, నైతిక విలువల పట్ల శ్రద్ధ వంటి సద్గుణాలను పెంపొందించేందుకు నిర్వహిస్తున్న ఈ పోటీల్లో భారతీయ చరిత్ర సంస్కృతి వారసత్వాలకు సంబంధించిన ప్రశ్నలు (మల్టిపుల్ ఛాయిస్) వుంటాయని తెలిపారు. 6 నుంచి పి.జి దాకా విద్యార్థులు ఈ పోటీల్లో పాల్గొనవచ్చని, పోటీల్లో పాల్గొనే విద్యార్థులు సంబంధిత హెడ్‌మాస్టర్, లేదా ప్రిన్సిపాల్ ధృవీకరణ పత్రం తీసుకురావాలని, ప్రశ్నాపత్రం తెలుగులోనే వుంటుందని, ప్రవేశం ఉచితమని పేర్కొన్నారు. హైస్కూల్, డిగ్రీ, పి.జిలలో తరగతికి 5 చొప్పున బహుమతులుంటాయని, 28వతేది సాయంత్రం 6గంటలకు టౌన్‌హాలులో జరిగే సోదరి నివేదిత 150వ జయంతి వేడుక సభలో విజేతలకు బహుమతులు ప్రదానం చేస్తామన్నారు. వివరాలకు 9394381122, లేదా 9703865147 నంబర్లకు సంప్రదించవచ్చని కోరారు.

# ఆత్మగౌరవ అవగాహన సదస్సు



నెల్లూరు ఆదిత్య కళాశాల సెమినార్ హాల్లో బుధవారం 'ఆత్మగౌరవ అవగాహన సదస్సు' జరిగింది. ఈ సదస్సుకు ముఖ్య అతిథిగా ఆత్మగౌరవ జిల్లా డైరెక్టర్ సుస్మితారెడ్డి పాల్గొని మాట్లాడుతూ గాంధీజీ పుట్టిన దేశంలో బహిరంగ మల, మూత్ర విసర్జన నిరోధించాలని, అప్పుడే భారతదేశ గౌరవం ప్రపంచ స్థాయిలో రాణిస్తుందన్నారు. ఈ సదస్సుకు అధ్యక్షత వహించిన ఆచార్య ఆదిత్య మాట్లాడుతూ బహిరంగ మల మూత్ర విసర్జన దేశానికి అరిష్టమని, బహిరంగ మల, మూత్ర విసర్జన నిరోధించాలన్నారు. ఈ సదస్సులో ఎం.మాలకొండారెడ్డి, టి.తారక్‌ప్రసాద్, విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు.

# జర్నలిస్ట్ పట్టభద్రులు ఓటు నమోదు చేసుకోవాలి

శాసనమండలి పట్టభద్రుల నియోజకవర్గ ఎన్నికల్లో పాల్గొనేందుకు జర్నలిస్ట్ పట్టభద్రులు తమ ఓటును నమోదు చేసుకోవాలని ఏపియుడబ్ల్యూజె రాష్ట్ర కార్యదర్శి ఎ.జయప్రకాష్ ఒక ప్రకటనలో కోరారు. గతంలో పేరు మాత్రం రిజిష్టరు చేసుకుని ఉంటే తమ ఫోటోను, స్థానిక ధృవీకరణ పత్రాన్ని జతపరచాలన్నారు. 2013 అక్టోబర్ 30 నాటికి డిగ్రీ పూర్తి చేసి ఉండాలని, డిగ్రీ సర్టిఫికేట్ కాపితో, స్థానిక ధృవీకరణకై ఆధార్ లేదా ఓటర్ కార్డు జత పరచాలన్నారు. నవంబర్ 5వ తేదీ లోగా ఆన్‌లైన్‌లో రిజిష్టర్ చేసుకోవాలని, అలాకుదరని పక్షంలో తహశీల్దార్ కార్యాలయంలో ప్రత్యేక ధరఖాస్తు పూర్తి చేసి ఓటు నమోదు చేసుకునే సదుపాయం ఉందని తెలిపారు.

# 'నుడా' ఆవిర్భావం

(మొదటి పేజీ తరువాయి)

జిల్లాకు ఉత్తరాన ఉన్న కావలి మండలం నుండి దక్షిణాన వున్న తడ వరకు జాతీయ రహదారికి ఇరువైపులా వున్న మండలాలను 'నుడా'లో చేర్చారు. 1644 చదరపు కిలోమీటర్ల విస్తీర్ణంతో ఒక కార్పొరేషన్, నాలుగు మున్సిపాల్టీలు, 21 మండలాలు, 156గ్రామాలతో 13.01లక్షల జనాభాతో నెల్లూరు అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటి రూపుదిద్దుకుంది. కాంగ్రెస్ ప్రభుత్వంలోనే 'నుడా' ఏర్పాటుపై చర్చలు జరిగినా కార్యరూపం దాల్చలేదు. 2014లో తెలుగుదేశం ప్రభుత్వం వచ్చినప్పటి నుండి కూడా 'నుడా' ఏర్పాటుపై ప్రయత్నాలు జరుగుతూ వచ్చాయి. పలు దఫాలుగా నివేదికలు తయారయ్యాయి. సాధారణంగా ఇంతకుముందు అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీలను ఆ నగరం పరిసరాలలో గ్రామాలను కలిపి ఏర్పాటు చేసేవాళ్లు. కాని తొలిసారిగా దాదాపు 200 కిలోమీటర్ల పొడవున 'నుడా'ను ఏర్పాటు చేసారు. అమరావతి రాజధాని కూడా ఇంత పొడవున లేదు.

## ఛైర్మెన్ గిరిపై ఆశలు

నుడా ఆవిర్భవించింది. ఇక పాలక మండలిని నియమించాలి. ఒక ఛైర్మెన్, 20మంది సభ్యులు ఉంటారు. సభ్యుల సంగతి పక్కన పెడితే, ఛైర్మెన్ పదవి కోసం ఇక రసవత్తరమైన పోటీ ఉంటుంది. 'నుడా' ఛైర్మెన్ రేసులో ముంగమూరు శ్రీధరకృష్ణారెడ్డి, డాక్టర్ జడ్.శివప్రసాద్, దేశాయిశెట్టి హనుమంతురావు, కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డి, అనూరాధ వంటి నాయకులందరూ వున్నారు. ఎవరి మార్గాల్లో వాళ్లు ప్రయత్నాలు కూడా చేస్తున్నారు. అయితే వీరెవరికీ సంబంధం లేకుండా, అసలు రాజకీయాలతో కూడా సంబంధంలేని స్వర్ణభారత్ ట్రస్ట్ మేనేజింగ్ ట్రస్టీ దీపా వెంకట్ పేరు కూడా ఛైర్మెన్‌గా ప్రచారంలో ఉండడం విశేషం. కేంద్రమంత్రి యం.వెంకయ్యనాయుడు కుమార్తెగానే కాక, స్వర్ణభారత్ ట్రస్ట్, నెల్లూరు నెక్ట్స్ వంటి కార్యక్రమాలతో నెల్లూరు అభివృద్ధి కోసం సొంత ప్రణాళికలతో ముందుకు వెళుతున్న ఆమెను 'నుడా'కు ఛైర్మెన్‌గా చేస్తే తెలుగుదేశంలో అసంతృప్తికి తెరదించడంతో పాటు నెల్లూరు అభివృద్ధికి కేంద్ర రాష్ట్ర స్థాయిలో పూర్తి స్థాయి సహకారం పొందవచ్చనే ఆలోచన వుంది. ఇక రెండో కోణంలో డాక్టర్ జడ్.శివ ప్రసాద్ పేరు బలంగా వినిపిస్తోంది. 2014 కార్పొరేషన్ ఎన్నికల్లో నెల్లూరులో తెలుగుదేశం పార్టీని ముందుకు నడిపింది ఆయనే! పార్టీకి అన్ని విధాలుగా సేవలందించారు. పార్టీ ప్రతిపక్షంలో వున్నప్పుడు సైతం వైద్యవృత్తి ద్వారా పలు ప్రాంతాల్లో ఉచిత వైద్యశిబిరాలు నిర్వహించి పార్టీని ప్రజల్లోకి తీసుకెళ్లారు. అదీగాక నెల్లూరు రూరల్, నగర నియోజకవర్గాల ఇన్‌ఛార్జ్ లుగా గాని, కన్వీనర్‌లుగా కాని అగ్ర వర్ణాల నాయకులున్నారు. మైనార్టీకి చెందిన వ్యక్తి మేయర్‌గా ఉన్నారు. ఈ నేపథ్యంలో బలహీనవర్గాలలో బలం పెంచుకునే దిశగా ఆ వర్గాలకు చెందిన జడ్.యస్‌ను నుడా ఛైర్మెన్‌ను చేస్తే బాగుంటుందనే ఆలోచన కూడా పార్టీ దృష్టిలో ఉన్నట్లు తెలుస్తోంది.

# వలస పక్షుల్లో వేదన

(మొదటి పేజీ తరువాయి)

తెలుగుదేశం నాయకులు వీరిని ఏ మాత్రం లెక్కచేయడం లేదు. వీరిలో కొందరికి చంద్రబాబు మంత్రిపదవుల హామీ ఇచ్చి వున్నాడు. ఆ పదవులన్నా వస్తే తమ పరపతి పెరుగుతుందని, అనుచరులను కాపాడుకోగలమని వీరి బాధ. చంద్రబాబు మాత్రం మంత్రివర్గ విస్తరణ జోలికి పోవడం లేదు. పార్టీలో ఆయన సమస్యలు ఆయనకున్నాయి. కాని ఇప్పటికే మూడేళ్లు కావస్తుంది. ఇక మంత్రి పదవి వచ్చినా గట్టిగా వెలగబెట్టేది ఒకటి, ఒకటిన్నర సంవత్సరమే! ఇప్పుడు కూడా మంత్రి పదవులు ఇవ్వకపోతే తర్వాత ఇచ్చినా దండగే అన్న నిర్లిప్తధోరణి జంపింగ్ ఎమ్మెల్యేలలో వ్యక్తమవుతోంది. 'దూరపు కొండలు నునుపు' అన్న సామెతను పెద్దలు వూరకే చెప్పారా?

# బాబు జిత్తులను... జగన్ చిత్తుచేసేనా?

(మొదటి పేజీ తరువాయి)

ఉంటామని చంద్రబాబు ఘంటాపథంగా చెబుతున్నాడు. ఇది తన మీద నమ్మకంతో అంటున్నది కాదు. జగన్ మీద నమ్మకంతో చెబుతున్నది. ఎన్నో అవకాశాలున్నప్పటికీ 2014ఎన్నికల్లో జగన్ సద్వినియోగం చేసుకోలేకపోయాడు. అధికారపక్షంగా ఈ మూడేళ్లలో చంద్రబాబు ఎన్నో తప్పులు చేశాడు. కాని వాటిని ఎత్తిచూపడంలో ప్రతిపక్షం అంతకంటే అధ్వాన్నంగా వుంది. జగన్ నాయకత్వంలో ప్రతిపక్షం ఉన్నంత కాలం తనకు తిరుగులేదని చంద్రబాబు ధీమా! 2019 ఎన్నికల కసరత్తును చంద్ర బాబు ఇప్పటి నుండే మొదలుపెట్టాడు. వచ్చే ఎన్నికల్లో తిరిగి అధికారం నిలబెట్టు కోవడానికి ఆయన ప్రధానంగా కొన్ని మార్గాలను ఎంచుకున్నాడు. అందులో ప్రధానమైనది డబ్బు. 2014 ఎన్నికల్లో ఇది బాగానే పని చేసింది. 2019 ఎన్ని కల్లో కూడా ఇదే ప్రధాన భూమిక పోషించ నుంది. అందుకు తగిన ఆర్థిక వనరులు పోగుచేసారని సమాచారం. పోలవరం, పట్టిసీమ, పురుషోత్తమపట్నం, పుష్క రాలు... అన్నీ 'పి'తో కలిసొచ్చిన అంశాలే! ఇక రెండోది రాష్ట్రంలో అసెంబ్లీ నియో జకవర్గాల సంఖ్యను పెంచడం. చంద్ర బాబు దీనిపైనే ప్రధానంగా దృష్టిపెట్టి వున్నాడు. ప్రత్యేకహోదా విషయంలో కేంద్రంతో రాజీపడింది కూడా రాష్ట్రంలో నియోజకవర్గాల పెంపు కోసమే!

చంద్రబాబు గట్టిగా పోరాడి వుంటే ప్రత్యకహోదాపై కేంద్రం తలొంచాల్సి వచ్చేది. చంద్రబాబు రాష్ట్రానికి ప్రత్యేక హోదా కంటే కూడా పోలవరం ప్రాజెక్ట్ నిర్మాణం బాధ్యతను తనకు అప్పగించడం, రాష్ట్రంలో నియోజకవర్గాల సంఖ్యను 175 నుండి 225కు పెంచడంపై కేంద్రంతో ఒప్పందం కుదుర్చుకున్నాడు. వీటిలో మొదటి పనైంది. రెండోది డీలిమిటేషన్ ప్రక్రియను మొదలు పెట్టడం. నియోజక వర్గాలు పెరిగితే దానికి తగినట్లుగా అభ్యర్థులు తెలుగుదేశంలో వున్నారు. రాజ కీయంగా, ఆర్థికంగా బలమైన నాయకు లందరికీ సీట్లు సర్దుబాటు చేయొచ్చు. అదే సీట్లు పెరక్కపోతే తెలుగుదేశంలో సీట్లు రాని వాళ్లు వైకాపాకు వెళ్లే అవకాశ ముంది. జగన్‌కు ఆ ఛాన్స్ ఇవ్వకూడదనే చంద్రబాబు సీట్ల పెంపుకు పాకులాడు తున్నాడు.

ఆంధ్రాతో పాటు తెలంగాణలో కూడా అసెంబ్లీ సీట్లు పెంచే అవకాశ ముంది. అయితే దీనికి పార్లమెంటు ఆమోదం కావాలి. పార్లమెంట్‌లో విప క్షాలు దీనిని తిరస్కరించవచ్చు. అయినా కూడా కేంద్రం ఆర్డినెన్స్ ద్వారా నియోజక వర్గాలను పెంచవచ్చు. ప్రతిపక్షంగా వైకాపా దీనిని అడ్డుకోవడానికి సుప్రీం కోర్టును ఆశ్రయించవచ్చు. అయితే చంద్రబాబుకు సంబంధించిన కేసులకు న్యాయస్థానాల నుండి ఎటువంటి తీర్పులు వస్తున్నాయో చూస్తూనే వున్నాం.

కాబట్టి రాష్ట్రంలో నియోజకవర్గాలు పెరగడం అంటూ జరిగితే అది చంద్ర బాబుకు రాజకీయంగా ప్రయోజనమే! మరి చంద్రబాబు రాజకీయ ఎత్తులను జగన్ ఎంతవరకు తట్టుకుని నిలబడగలడు? వేచి చూడాల్సిందే!

## అంతర్జాతీయ కబడ్డీ పోటీలకు

# యం.యస్.ఆర్ స్పోర్ట్స్ క్లబ్ జట్టు

- ఏపికి తొలిసారిగా దక్కిన అవకాశం
- నెల్లూరుజిల్లాకే గర్వకారణం

*ఓ చిన్న ప్రోత్సాహంతో రాళ్లను రత్నాలుగా మలచవచ్చు. రవ్వంత సహకారంతో మట్టిలో నుండి మాణిక్యాలను వెలికి తీయొచ్చు. దీనికి ఉదాహరణే వచ్చే ఏడాది థాయ్‌లాండ్ రాజధాని బ్యాంకాక్‌లో జరుగనున్న అంతర్జాతీయ కబడ్డీ పోటీలకు ఎంపికైన నెల్లూరుజిల్లాకు చెందిన యం.యస్.ఆర్ స్పోర్ట్స్ క్లబ్ కబడ్డీ జట్టు. సాధారణ వ్యక్తులకు కొంత చేయూత వుంటే శక్తులుగా మారతారనడానికి ఈ కబడ్డీ జట్టు గెలుపే ఉదాహరణ. ఈ నెల **13, 14, 15**తేదీలలో గుజరాత్‌లోని వడోదరలో జరిగిన ఆలిండియా స్టూడెంట్స్ ఒలింపిక్ నేషనల్ గేమ్స్‌లో ఆంధ్రప్రదేశ్ తరపున పాల్గొన్న నెల్లూరుజిల్లాకు చెందిన యం.యస్.ఆర్ స్పోర్ట్స్ క్లబ్ జట్టు కబడ్డీ పోటీలలో అత్యంత శక్తివంతమైన మహారాష్ట్ర జట్టును ఒక్క పాయింట్ తేడాతో ఓడించి బంగారు పతకాన్ని సొంతం చేసుకుంది. గత **30**ఏళ్లలో ఆంధ్రప్రదేశ్ తరపున ఓ కబడ్డీ జట్టు మొదటి స్థానంలో నిలిచి కప్‌ను సొంత చేసుకోవడం ఇదే ప్రథమం. జాతీయ పోటీలలో విజేతగా నిలిచిన యం.యస్.ఆర్ స్పోర్ట్స్ క్లబ్ జట్టే బ్యాంకాక్‌లో జరిగే ఇంటర్నేషనల్ స్టూడెంట్స్ ఒలింపిక్ గేమ్స్‌లో భారతదేశం తరపున ఆడబోతోంది. ఇది మన ఏపికి, మన నెల్లూరుజిల్లాకే గర్వకారణం.*

ఈ జట్టు విజయ ప్రస్థానం వెనుక వున్నది ఏ పేరు మోసిన కార్పొరేట్ కంపెనీయో, ప్రభుత్వ క్రీడా అకాడమీయో, టాప్ సినిమాయాక్టర్లో కాదు, నెల్లూరుకు చెందిన పాతికేళ్ల కుర్రాడు. ఈ జట్టు విజయ ప్రస్థానంలో ప్రధానపాత్ర పోషించాడు. ఆ యువకుడే మాగుంట శరత్‌చంద్రారెడ్డి. నెల్లూరు సరస్వతీనగర్‌కు చెందిన ప్రముఖ కాంట్రాక్టర్ మాగుంట వెంకటనారాయణరెడ్డి కుమారుడు. మాగుంట శరత్‌చంద్రారెడ్డి సేవాసమితి ద్వారా గత కొన్నేళ్లుగా నగరంలో పలు సేవా కార్యక్రమాలు నిర్వహిస్తూ నెల్లూరీయులకు సుపరిచితుడైన యువసేవా స్వాప్నికుడు.

మాగుంట శరత్‌చంద్రారెడ్డి సేవాసమితి ఆధ్వర్యంలో 2015 జనవరిలో నెల్లూరు, విఆర్‌సి మైదానంలో సంక్రాంతి సంబరాలను నిర్వహించారు. ఈ సందర్భంగా జరిగిన ఆటల పోటీలలో



యంయస్‌ఆర్ స్పోర్ట్స్ క్లబ్ తరపున యం.మణికంఠచక్రవర్తి (కోవూరు), కె.మహేంద్రబాబు(కోవూరు), జి.శ్రీనివాసులు (ముదివర్తిపాలెం), సి.హెచ్.ఏ.చక్రవర్తి(కోవూరు), ఎస్.నాగార్జున (సిద్ధీపురం), పి.రాజేష్(ఇనమడుగు), ఎల్.దుర్గాప్రసాద్(బుచ్చి), నాగేంద్ర(ఇస్కపల్లి)లతో కబడ్డీ జట్టు ఏర్పడింది. ఈ ఏడాదిలో జరిగిన రాష్ట్ర స్థాయి స్టూడెంట్ ఒలింపిక్ నేషనల్ గేమ్స్‌లోనూ కబడ్డీలో యం.యస్.ఆర్ స్పోర్ట్స్ క్లబ్ జట్టు విజేతగా నిలిచి జాతీయ పోటీలకు అర్హత సాధించింది. ఇప్పుడు జాతీయ స్థాయి పోటీలలోనూ తమ సత్తా నిరూపించుకుని అంతర్జాతీయ పోటీలకు ఎంపికైంది. క్రికెట్ మాయాజాలంలో మన సాంప్రదాయ క్రీడలు మరుగైపోతున్న తరుణంలో ఇటీవల మళ్లీ కబడ్డీ ఆట ప్రాణం పోసుకుంది. కబడ్డీ పట్ల క్రీడాభిమానుల్లో ఆదరణ పెరుగుతోంది. మన క్రీడల ప్రాభవానికి ఇది శుభారంభం. యంయస్‌ఆర్ స్పోర్ట్స్ క్లబ్ కబడ్డీ జట్టు మనది. మన నెల్లూరుది. కాబట్టి మనమంతా అండగా నిలుద్దాం... అంతర్జాతీయ పోటీలలోనూ గెలిచి కీర్తి, ప్రతిష్టలు తీసుకురావాలని ఆకాంక్షిద్దాం... ఆశీర్వదిద్దాం!



## వచ్చే ఏడాది డిసెంబర్ నాటికి

# అగనంపూడి క్యాన్సర్ ఆసుపత్రి సిద్ధం

### రాజ్యసభ సభ్యుడు టిఎస్ఆర్ వెల్లడి

వచ్చే ఏడాది డిసెంబర్ నాటికి విశాఖలోని అగనంపూడిలో హోమీబాబా క్యాన్సర్ ఆసుపత్రి నిర్మాణం జరిగి, పూర్తిస్థాయిలో వైద్యసేవలు అందుబాటులోకి వస్తాయని రాజ్యసభ సభ్యుడు, రాజ్యసభ సబార్డినేట్ లెజిస్లేషన్ కమిటీ ఛైర్మెన్ డాక్టర్ టి.సుబ్బరామిరెడ్డి తెలియజేశారు. ఇటీవల టిఎస్ఆర్ ఆధ్వర్యంలో ఆ కమిటీ సభ్యులు అగనంపూడి ఆసుపత్రిని సందర్శించారు. ప్రస్తుతం ఓపి సేవలను అందిస్తున్న ఆ ఆసుపత్రిలో పలు విభాగాలను డే-కేర్ సెంటర్‌ను కమిటీ పరిశీలించింది.

ఈ సందర్భంగా టిఎస్సార్ మాట్లాడుతూ, పదిహేనేళ్ళ క్రితం అణుశక్తి విభాగం ఆధ్వర్యంలో టాటా క్యాన్సర్ ఆసుపత్రికి అనుబంధంగా ఆంధ్రప్రదేశ్‌కు ఈ ఆసుపత్రి మంజూరు కావాల్సివుండగా అది సాధ్యం కాలేదన్నారు. తాను శాస్త్ర, సాంకేతిక, పర్యావరణం, అడవులు పార్లమెంటరీ స్టాండింగ్ కమిటీ ఛైర్మెన్‌గా వుండగా క్యాన్సర్ ఆసుపత్రి మంజూరుకు వివిధ రాష్ట్రాల నుంచి తీవ్రమైన పోటీ వున్నప్పటికీ పట్టుబట్టి సాధించామన్నారు. హోమీబాబా క్యాన్సర్ ఆసుపత్రి డైరెక్టర్ డి.రాఘవరావు మాట్లాడుతూ, 2009లో ఈ ఆసుపత్రి రాష్ట్రానికి మంజూరైనప్పటికీ పలు కారణాల వల్ల ఆ ప్రయత్నాలు ఆగిపోయాయన్నారు. ఆ ప్రయత్నాలను టిఎస్ఆర్ పునరుద్ధరించి అప్పటి ప్రధానితో సంప్రదించి విశాఖలో ఈ ఆసుపత్రి నిర్మాణానికి కేవలం 24 గంటల్లోనే అనుమతి వచ్చేలా కృషి చేశారని ఆయన గుర్తుచేశారు. గత రెండు సంవత్సరాల్లో విశాఖలోని హోమీబాబా క్యాన్సర్ ఆసుపత్రిలో 9వేల మంది రోగులకు వైద్యసేవ లందించినట్లు ఆయన వివరించారు. ఆసుపత్రి నిర్మాణం పూర్తయితే ఏటా కనీసం పదివేల మందికి వైద్యసేవలు అందించేందుకు వీలు కలుగుతుందన్నారు.

కాగా, ఈ ఆసుపత్రిని సందర్శించినవారిలో కమిటీ ఛైర్మెన్ డాక్టర్ టి.సుబ్బరామిరెడ్డి, సభ్యులు కె. కేశవరావు, బిశ్వజిత్ దయమరే, ఎస్.ముత్తుకరయప్పన్, శంకర్‌భాయ్, భాస్కర్‌రావు నెక్కంటి, విశాఖ స్టీల్ సిటీ ప్లాంట్ సిఎండి పి.మధుసూదనరావు తదితరులు పాల్గొన్నారు.

## దుబాయ్‌లో...

# సింహపురీయన్స్ మీట్ & గ్రీట్



ఈ నెల 14వ తేదీన దుబాయ్‌లోని ముషరఫ్ పార్క్‌లో సింహపురీయన్స్ యుఏఇ 3వ మీట్ & గ్రీట్ ఎంతో ఆత్మీయ వాతావరణంలో జరిగింది. సినీ డైరెక్టర్ పి.సునీల్‌కుమార్‌రెడ్డి ఈ ఆత్మీయ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేశారు. యునైటెడ్ అరబ్ ఎమరేట్స్‌లోని వివిధ ప్రాంతాల్లో వివిధ వృత్తులు, ఉద్యోగాల్లో వున్న నెల్లూరీయులందరూ ఆరోజు అక్కడ కలుసుకున్నారు. గంగపట్నం ఉదయభాస్కర్‌రెడ్డి సమన్వయంతో జరిగిన ఈ కార్యక్రమంలో దుబాయ్‌లో ఉంటున్న దువ్వూరు కిషోర్‌బాబు, విజయ్‌కుమార్, సాయిప్రకాష్, కిరణ్‌కుమార్‌రెడ్డి, భానుప్రకాష్‌రెడ్డి, ఫజుల్‌రెహమాన్, వర్ధన్, సింధూర, తులసీప్రసాద్, మెయినుద్దీన్, పి.ఎన్.కుమార్, శ్రీనివాస్, అనిల్‌బాబు, రాజా తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా సింహపురీయన్స్ అందరూ నెల్లూరు వంటకాలతో విందు ఆరగించి ఉల్లాసంగా, ఉత్సాహంగా గడిపారు.



**ఈ నెల 14వ తేదీన నెల్లూరు బారాషాహీద్ దర్గా వద్ద రొట్టెల పండుగలో పాల్గొన్న వైయస్సార్ కాంగ్రెస్‌పార్టీ అధ్యక్షుడు, ప్రతిపక్ష నేత వై.యస్.జగన్మోహన్‌రెడ్డి**




Edited, Published, Printed & Owned by **THUNGA SIVAPRABHATH REDDY**, Plot no:1&2, Main Road, Magunta Layout, NELLORE-524003. Printed & Published at **Roopa Graphics**, Plot no:1&2, Main Road, Magunta Layout, NELLORE-524003. Ph:2323485. Editor-**THUNGA SIVAPRABHATH REDDY,** Executive Editor-**G.SREENIVASULU REDDY**. e-mail: roopagroup@yahoo.com